http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఆదివారం 23 ఫిబ్రవరి 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828




### రేవంత్ రెడ్డి దివాళాకోరు..
## అబద్దాల రాయుడు

- మోడీ తలకిందులుగా తపస్సు చేసినా, రాహుల్ గాంధీ వంద జోడో యాత్రలు చేసినా కేసీఆర్ లెక్క రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేరు.
- తెలంగాణ దివాళా తీసిందని రేవంత్ రెడ్డి చెప్పినవన్నీ పచ్చి అబద్దాలే
- గత 15 నెలలుగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రేవంత్ రెడ్డి నుంచి మొదలుపెడితే ప్రతి కాంగ్రెస్ నాయకుడు ఒక ఎజెండా ప్రకారం గోబెల్స్ వారసుల్లాగా తెలంగాణ ఆర్థిక ప్రగతిపై దుష్ప్రచారం చేస్తున్నరు


# బీసీలపై పెద్ద కుట్ర

- బీఆర్ఎస్, బీజేపీలపై సీఎం రేవంత్ ఫైర్
- "తప్పు తప్పు అంటూ బీఆర్ఎస్, బీజేపీ అసత్య ప్రచారం చేస్తున్నాయి
- ఎక్కడ తప్పు జరిగిందో చూపించాలంటూ ఆ పార్టీ నేతలకు సవాల్
- "రాష్ట్ర పార్టీ నేతలకు బీసీ కులగణనపై అవగాహన చేసుకోవాలి
- ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దు
- బీసీలు మౌనంగా ఉంటే మీకే నష్టం
- బీసీలు నిలదీస్తే.. తమ పదవులు పోతాయని బీజేపీ, బీఆర్ఎస్‌లో రెండు వర్గాల వారు కుట్ర చేస్తున్నారు.
- రాహుల్ గాంధీ ఆశయం మేరకే...!
- బీసీ కులగణనపై రేవంత్ రెడ్డి
- కులగణన చారిత్రాత్మకమైన నిర్ణయమన్న ముఖ్యమంత్రి
- కులగణన విషయంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని వెల్లడి



హైదరాబాద్

బీసీ రిజర్వేషన్ల కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తా.. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీ బీసీ నేతలదేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన బీసీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "తప్పు తప్పు అంటూ బీఆర్ఎస్, బీజేపీ అసత్య ప్రచారం చేస్తున్నాయి.. ఎక్కడ తప్పు జరిగిందో చూపించాలంటూ ఆ పార్టీ నేతలకు సవాల్ విసిరారు. "రాష్ట్ర పార్టీ నేతలకు బీసీ కులగణనపై అవగాహన చేసుకోవాలి. ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దు. బీసీలు మౌనంగా ఉంటే మీకే నష్టం. బీసీలు నిలదీస్తే.. తమ పదవులు పోతాయని బీజేపీ, బీఆర్ఎస్‌లో రెండు వర్గాల వారు కుట్ర చేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి కొస్తే కులగణన చేస్తామని రాహుల్ గాంధీ మాటిచ్చారు. బలహీన వర్గాలు ముందుకొచ్చి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. మా నాయకుడు ఇచ్చిన మాటను నిలబెట్టాలని బీసీ కులగణన చేశాం" అని రేవంత్ చెప్పారు. "కేసీఆర్ ఒక్క రోజులో సర్వే చేసి కాకి లెక్కలు చెప్పారు. - మిగతా3లో



## 3 రాష్ట్రాల్లో మోదీ పర్యటన

- మధ్యప్రదేశ్ బీహార్ అసోం రాష్ట్రాల్లో 23 నుంచి 25 వరకూ ఆయన పర్యటన
- మధ్యప్రదేశ్‌లో బాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్‌ను మోదీ శంకుస్థాపన
- 23వ తేదీన ఆయన మధ్యప్రదేశ్ ఛాతర్‌పూర్ జిల్లాలో పర్యటిస్తారు.
- ప్రధాని 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు గౌహతి చేరుకుంటారు

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో అపశ్రుతి

- 3 మీటర్ల మేర పడిపోయిన టన్నెల్ పైకప్పు
- తీవ్రంగా గాయపడ్డ ముగ్గురు కార్మికులు.. 8 మంది గల్లంతు
- రక్షించిన తోటి కార్మికులు .. హుటాహుటిన జెన్‌కో హాస్పిటల్‌కు తరలింపు



## పోలీస్ శాఖ అవసరాలు తీరుస్తాం

- దేశంలో తెలంగాణ పోలీస్ కు మంచి పేరు ఉంది
- రాష్ట్రం నగర రాజ్యముగ అభివృద్ధి చెందుతుంది..
- ఆ మేరకు భద్రత పెరగాలి
- దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు మంచి పేరు ఉంది
- ప్రధానంగా సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం విషయంలో దేశంలో అగ్రస్థానంలో ఉన్నారు
- ఉప ముఖ్యమంత్రి భట్టి



హైదరాబాద్

రాష్ట్రంలో ప్రతి పౌరుడు సురక్షితంగా జీవిస్తున్నారు అన్న భరోసాతో ఉండాలి, ఆ మేరకు పోలీసు శాఖ అవసరాలు తీర్చే బాధ్యత మేము తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో హోం శాఖ ప్రీ బడ్జెట్ సమావేశాల్లో - మిగతా3లో



## ఆ విషయంలో మాతో ఆటలొద్దు

- కేంద్రానికి కమల్‌హాసన్ వార్నింగ్
- 'తమిళులకు భాష చాలా ముఖ్యమైనది
- మాతో ఈ విషయంలో ఆటలొద్దు
- భాష కోసం ప్రాణాలు కూడా వదిలేశాం
- మా పిల్లలకు కూడా ఏ భాష కావాలో తెలుసు.

### సీఎం రేవంత్ సవాల్‌ను
# స్వీకరిస్తున్నా

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు గెలుస్తాం

ఏ ఒక్క హామీకి కనీసం కార్యచరణ కూడా లేదు

చర్చకు రమ్మనడం హాస్యాస్పదం

దేనికి చర్చకు రావాలో సీఎం రేవంత్ స్పష్టం చేయాలని: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




నిజామాబాద్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు గెలుస్తామని.. సీఎం రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హామీలు అమలుకు ప్రణాళిక, కార్యాచరణ ప్రకటిస్తే చర్చకు సిద్ధమన్నారు. ఏ ఒక్క హామీకి కనీసం కార్యచరణ కూడా లేదు. చర్చకు రమ్మనడం హాస్యాస్పదం. దేనికి చర్చకు రావాలో సీఎం రేవంత్ స్పష్టం చేయాలని కిషన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలోచించి ఓటేయాలి. బీజేపీని ఆదరించాలి. బీఆర్ఎస్ పాలనలో శాసన మండలి ప్రాధాన్యత తగ్గింది. ఎన్నికల్లో పసుపు బోర్డు ప్రభావం ఉంటుంది. కులగణనకు - మిగతా3లో

## ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ-2 గా ఆర్బీబీ మాజీ గవర్నర్

- ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ2గా నియమించడానికి క్యాబినెట్ కమిటీ ఆమోద ముద్ర
- తాతా ఉత్తర్వులు ప్రకారం ప్రధాని మోదీ పదవీకాలంతో సమానంగా లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ శక్తికాంత్ దాస్ ఈ పదవిలో కొనసాగనున్నారు
- భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్‌గా సేవలందించిన శక్తికాంత్ దాస్..



## ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలకు రంగం సిద్ధం

ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారి అసెంబ్లీ సమావేశం

25వ తేదీన లెఫ్టినెంట్ గవర్నర్ అసెంబ్లీలో ప్రసంగం

ఇక 27వ తేదీ గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం చర్చ



# 3 రాష్ట్రాల్లో మోదీ పర్యటన



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన ఆదివారం మొదలవుతుంది. మధ్యప్రదేశ్ బీహార్ అసోం రాష్ట్రాల్లో 23 నుంచి 25 వరకూ ఆయన పర్యటన సాగుతుంది. మధ్యప్రదేశ్‌లో బాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్‌ను మోదీ శంకుస్థాపన చేస్తారు. ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను సోమవారంనాడు ప్రారంభిస్తారు. అసోంలో జుమోయిర్ బినాందిని కార్యక్రమంలో పాల్గొంటారు. అసోంలో టీ పరిశ్రమ, పారిశ్రామికీకరణ జరిగి 200 ఏళ్లు అయిన సందర్భంగా ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నారు.

**మధ్యప్రదేశ్‌లో..**

పీఎం పర్యటన వివరాల ప్రకారం, 23వ తేదీన ఆయన మధ్యప్రదేశ్‌లి ఛాతర్‌పూర్ జిల్లాలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు బాగేశ్వర్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు శంకుస్థాపన చేస్తారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు భోపాల్‌లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను ప్రారంభిస్తారు. 60 దేశాలకు చెందిన ప్రతినిధులు, వివిధ అంతర్జాతీయ సంస్థలకు సంబంధించిన అధికారులు, ఇండియాకు చెందిన 300 మందికి పైగా ప్రముఖ పారిశ్రామిక నేతలు తదితరులు ఈ సమ్మిట్‌లో పాల్గొంటారు.

**బీహార్‌లో...**

ప్రధాని 24వతేదీ ఉదయం 2.15 గంటలకు బీహార్‌లోని భాగల్‌పూర్ చేరుకుంటారు. పీఎం కిసాన్ స్కీమ్ 19వ ఇన్‌స్టాల్‌మెంట్‌ను విడుదల చేస్తారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడం, జాతికి అంకితం చేయడం చేస్తారు.

**అసోంలో..**

ప్రధాని 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు గౌహతి చేరుకుంటారు. మెగా ఝుమోయిర్ 2025 ప్రోగ్రాంలో పాల్గొంటారు. 25వతేదీ ఉదయం 10.45 గంటలకు గౌహతిలో జరిగే అడ్వాంటేజ్ అసోం 2.0 ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్ 2025లో పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ అంతర్జాతీయ సంస్థలు, గ్లోబల్ లీడర్లు, పెట్టుబడిదారులు, విధాననిర్ణేతలు, పరిశ్రమ నిపుణులు, స్టార్టప్స్, విద్యార్థులు తదితరులు పాల్గొంటారు.

# ఆ విషయంలో మాతో ఆటలొద్దు



చెన్నై:తమిళులు భాష కోసం ప్రాణాలు వదిలారని, ఈ విషయంలో తమతో ఆటలొద్దని ప్రముఖ నటుడు మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎమ్) అధినేత కమల్‌హాసన్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎమ్ఎన్ఎమ్ పార్టీ 8వ వ్యవస్థాపక దినం సందర్భంగా కమలహాసన్ మాట్లాడారు. 'తమిళులకు భాష చాలా ముఖ్యమైనది. మాతో ఈ విషయంలో ఆలలొద్దు.భాష కోసం ప్రాణాలు కూడా వదిలేశాం.మా పిల్లలకు కూడా ఏ భాష కావాలో తెలుసు.ఏ భాష కావాలో ఎంపిక చేసుకునే జ్ఞానం వారికి ఉంది'అని పరోక్షంగా కేంద్రం తీసుకువచ్చిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపీ)ని ఉద్దేశించి కమల్ వ్యాఖ్యానించారు. తమిళనాడులో రెండు భాషల విధానం అమలులో ఉండగా ఎన్ఈపీ కింద హిందీతో కలిపి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. దీనిని అధికార డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.ఎన్ఈపీ అమలు చేయకపోతే తమిళనాడుకు రావాల్సిన రూ.2152 కోట్ల సమగ్రశిక్షాఅభియాన్ నిధులు నిలిపివేస్తామని కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రదాన్ ఇప్పటికే హెచ్చరించారు. ప్రదాన్ చేసిన వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేస్తూ సీఎం స్టాలిన్ ఇప్పటికే ప్రధాని మోదీకి లేఖ కూడా రాశారు. ఈ లేఖపై ప్రదాన్ తిరిగి స్పందించారు. తమిళనాడు ప్రభుత్వం రాజకీయాలు వదిలేసి విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించాలని సూచించారు.ఈ విషయమై తాజాగా ప్రధాని మోదీ కూడా పరోక్షంగా స్పందించారు. దేశంలో భాషల పట్ల శత్రుత్వం సృష్టించొద్దని కోరారు.

# మళ్లీ దడ పుట్టిస్తున్న చైనా



**బీజింగ్ :** చైనా రూపొదించిన రోబో డాగ్, డ్రోన్ మధ్య పోరాట వీడియో సోషల్ మిడియాలో వైరల్ అయింది. ఇప్పుడు చైనా సైన్యం చేసిన విన్యాసాలు దానికి మరింత ఊతం ఇచ్చాయి. గురువారం(ఫిబ్రవరి20) చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (ఖఐం) న్యూక్లియర్, బయోలాజికల్ అండ్ కెమికల్ డిఫెన్స్ డ్రిల్‌లో లు, రోబోటిక్ డాగ్‌లను ప్రదర్శించారు. చైనా ఇప్పుడు ఇలాంటి రోబోటిక్ కుక్కలపై దృష్టి సారించింది. రక్షణ రంగంలో ముందుకు సాగడంతో పాటు సైన్యాన్ని బలోపేతం చేసే దిశగా దీనిని ఒక పెద్ద అడుగుగా అభివర్ణిస్తున్నారు.రోబోటిక్ డాగ్‌లు శత్రువులను ఎదుర్కోవడానికి వ్యూహాన్ని మెరుగుపరుస్తాయి. సైనికుల బలిదాన ప్రమాదాన్ని తగ్గిస్తాయి. గత సంవత్సరం కూడా, చైనా తన సైన్యంలో భాగమైన రోబోటిక్ కుక్క లక్షణాలను పరిచయం చేసింది. అవి ఎలా పనిచేస్తాయో తెలుసా, చైనీయులకు ఎన్ని రకాల రోబోటిక్ కుక్కలు ఉన్నాయి, చైనా, కంబోడియా మధ్య ఉమ్మడి సైనిక విన్యాసాల వీడియో విడుదలైంది. రోబో డాగ్ సామర్థ్యాలను వీడియోలో చూపించారు. సరళంగా చెప్పాలంటే, శత్రువుల ఇళ్లలోకి ప్రవేశించి వారిపై దాడి చేయగల సైనికులకు ప్రత్యామ్నాయంగా రోబోట్ కుక్కలను తయారు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నష్టం జరిగితే తక్కువగా ఉంటుంది. చైనా ఇప్పుడు టెక్నాలజీ సహాయంతో తన సైన్యాన్ని బలోపేతం చేసుకుంటోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మానవరహిత వైమానిక వాహనాలు, రోబోట్ కుక్కలు దీనికి ఉదాహరణలు.చైనా రోబో కుక్కలు నడవగలవు. పరుగెత్తవచ్చు. దూకవచ్చు, అడుగడుగునా అడుగులు వేయవచ్చు. అవసరమైనప్పుడు దూకవచ్చు కూడా. అవి అస్సాల్ట్ రైఫిళ్లను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తారు. చైనా సైన్యంలో రెండు రకాల రోబో కుక్కలు ఉన్నాయి. మొదటి కుక్క మరింత శక్తివంతమైనది. దీనికి అస్సాల్ట్ రైఫిల్ అమర్చారు. 50 కిలోల బరువున్న ఈ కుక్క తన లక్ష్యాన్ని ట్రాక్ చేస్తున్నప్పుడు తన దిశను కూడా మార్చుకుంటుంది. దాని లక్ష్యం దాని స్థానాన్ని మారుస్తుందని అనుకుందాం. అప్పుడు అది తన స్థానాన్ని మార్చుకుంటూనే తన లక్ష్యాన్ని గురి చూస్తుంది. రెండవ రోబో కుక్క బరువు 15 కిలోలు. దీనిని శత్రువుపై నిఘా పెట్టడానికి, కొన్ని నిర్దిష్ట విషయాలను గుర్తించడానికి ఉపయోగించవచ్చు.ఈ రోబోటిక్ కుక్కలను చైనీస్ స్టార్టప్ కంపెనీ యూనిట్రీ రోబోటిక్స్ అభివృద్ధి చేసిందని అనేక మీడియా నివేదికలలో పేర్కొన్నారు. అయితే, ఆ కంపెనీ దానిని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి సరఫరా చేయడానికి నిరాకరించింది. ఈ రోబోటిక్ కుక్కలను ఎక్కడి నుండి తీసుకువస్తున్నారో చైనా సైన్యం కూడా స్పష్టం చేయలేదు.గత సంవత్సరం గోల్డెన్ డ్రాగన్ 2024 వ్యాయామంలో కూడా వీటిని ప్రదర్శించారు. ఈ సైనిక విన్యాసాలను చైనా, కంబోడియా సంయుక్తంగా 2024 మే 16 నుండి 30 వరకు నిర్వహించాయి. ఈ శిక్షణలో, చైనా సైన్యం తన బలాన్ని ప్రదర్శించింది. భూమిపై, ఆకాశంలో తన ఆధునిక ఆయుధాలను మోహరించింది. ఇప్పుడు మరోసారి చైనా రోబోటిక్ కుక్క వార్తల్లో నిలిచింది. గత నెలలో వైరల్ అయిన ఒక వీడియోలో, కుక్క డ్రోన్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నట్లు కనిపించింది. ఈ వీడియోపై నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.

# లౌడ్ స్పీకర్ బ్యాన్ చేశారని..




ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో లౌడ్ స్పీకర్‌లను బ్యాన్ చేస్తూ స్థానిక అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఒక మౌలానా(మత పెద్ద) మసీదుపైకి ఎక్కి పెద్దగా అరుస్తూ, ముస్లిం సోదరులంతా నమాజ్‌కు రావాలని పిలుపునిచ్చారు. షాహీ జామా మసీదుపై జరిగిన ఈ ఉదంతానికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కోర్టు తీర్పు అనంతరం సంభాల్‌లోని అన్ని ప్రార్థనా ?స్థలాలు, మత ప్రదేశాలలో లౌడ్ స్పీకర్ల వినియోగాన్ని అధికారులు నిషేధించారు. అయితే ఇప్పుడు వీటిని ఉల్లంఘించినందున పోలీసులు ఆ మసీదుకు చెందిన ముగ్గురు మతపెద్దలపై కేసు నమోదు చేశారు. సంభాల్‌లోని షాహీ జామా ఇమామ్ మసీదు గత కొన్నాళ్లుగా వివాదాల్లో ఉంది. ఈ మసీదు ఉన్న ప్రాంతంలో గతంలో కల్కి ఆలయం ఉండేదని ఒక న్యాయవాది కోర్టులో దావా వేశారు. ఈ నేపథ్యంలో స్థానిక కోర్టు ఈ మసీదు సర్వేకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సర్వే రెండవ రోజున పెద్దసంఖ్యలో జనం మసీదు దగ్గరకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు జనానికి మధ్య వాగ్వాదం జరిగింది. పరిస్థితులను చక్కదిద్దేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నలుగురు మృతిచెందారు. 20 మంది పోలీసులతో పాటు పలువురు గాయపడ్డారు. నాటి నుంచి ఈ వివాదం రగులుతూనే ఉంది. ఇదే సమయంలో స్థానిక పరిపాలనా యంత్రాంగం అల్లర్లకు పాల్పడినవారిపై చర్యలు పట్టింది. సమాజ్‌వాదీ ఎంపీ బార్క్ కూడా ఈ వివాదాల్లో చిక్కుకున్నారు. ఇదిలావుండగా అక్రమ విద్యుత్ కనెక్షన్‌లను తొలగించేందుకు వెళ్ళిన బృందం ఒక పురాతన ఆలయాన్ని కూడా కనుగొంది. ఆలయం చుట్టూ ఒక బావిని కూడా వారు చూశారు. దీని తరువాత సంభాల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత మొదలయ్యింది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జియావుర్ రెహమాన్ బార్క్ ఇంట్లో కొంత భాగం అక్రమ నిర్మాణం పరిధిలోకి వచ్చింది. దీంతో ఎంపీ ఇంటి మెట్లను సంబంధిత అధికారులు తొలగించారు.

## ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ-2 గా ఆర్బీబీ మాజీ గవర్నర్



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ–2గా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) మాజీ గవర్నర్ శక్తికాంత్ దాస్ నియమితులయ్యారు. శక్తికాంత్ దాస్.. ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెకట్రరీ2గా నియమించడానికి క్యాబినెట్ కమిటీ ఆమోద ముద్ర వేసింది., ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తాతా ఉత్తర్వులు ప్రకారం ప్రధాని మోదీ పదవీకాలంతో సమానంగా లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ శక్తికాంత్ దాస్ ఈ పదవిలో కొనసాగనున్నారు. అయితే పికె మిశ్రా సెప్టెంబర్ 11, 2019 నుండి ప్రధానమంత్రికి ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్నారు. భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ గా సేవలందించిన శక్తికాంత్ దాస్.. గతేడాది డిసెంబర్ రెండో వారంలో తన పదవికి వీడ్కోలు పలికారు.2018 నుంచి ఆయన ఆర్బీఐ గవర్నర్ గా ఉన్నారు. ఆర్బీఐ గవర్నర్ గా ఉర్జిత్ పటేల్ హఠాత్తుగా వైదొలిన క్రమంలో ఆ బాధ్యతల్ని శక్తికాంత్ దాస్ చేపట్టారు. 1980 తమిళనాడు క్యాడర్ కు ఐఏఎస్ అధికారి అయిన శక్తికాంత్ దాస్.. ఢిల్లీ సెయింట్ స్టెఫెన్స్ కాలేజ్ నుంచి మాస్టర్ డిగ్రీ చేశారు. అనంతరం బర్మింగమ్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లో పీజీ పూర్తి చేశారు. 2016లో మోదీ ప్రభుత్వం ' పెద్ద నోట్ల రద్దు' చేస్తూ నిర్ణయం తీసుకున్న సందర్భంలో ఆయన ఎకానామిక్ అఫైర్స్ సెక్రటరీగా ఉన్నారు.

## విరిగిన సీట్లో మంత్రి ప్రయాణంపై ఏఐని వివరణ కోరిన డీజీసీఏ



**న్యూఢిల్లీ:** భోపాల్ నుంచి ఢిల్లీకి ప్రయాణంలో తనకు విరిగిపోయిన సీటు కేటాయించారంటూ ఎయిర్ ఇండియా నిర్వాకంపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆగ్రహం వ్యక్తం చేయడంపై సివిల్ ఏవియేషన్ రెగ్యులేటర్ డీజీసీఏ తక్షణ చర్యలకు దిగింది. వెంటనే వివరణ ఇవ్వాలని ఎయిరిండియాను ఆదేశించింది. దీనికిముందు, ఎయిరిండియా విమానంలో తనకు ఎదురైన అనుభవంపై సోషల్ మీడియాలో శివరాజ్ సింగ్ చౌహాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి డబ్బులు తీసుకుని అరకొర సౌకర్యాలు కల్పించడం ప్రయాణికులను మోసగించడమేనని అన్నారు. ఎయిరిండియా నిర్వహణ టాటా గ్రూప్ తీసుకున్న తర్వాత సేవలు మెరుగుపడాతాయని అనుకున్నానని, కానీ ఇది తన అపోహనని అర్థమైందని అసహనం వ్యక్తం చేశారు. విమానం ఎక్కగానే తన సీటు విరిగి ఉండటం చూసి ఆశ్చర్యపోయానని అన్నారు. మరి కొన్ని సీట్లు కూడా సరిగా లేవని సిబ్బంది చెప్పారని, కొందరు తమ సీట్లలో కూర్చోవాలని ఆఫర్ చేశారని చెప్పారు. అయితే వారిని ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక విరిగిపోయిన సీటులోనే గంటన్నర ప్రయాణం చేశామని వివరించారు. కేంద్ర మంత్రి ట్వీట్‌పై ఎయిర్‌లైన్స్ వెంటనే స్పందించింది. మంత్రికి కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరక్కుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపింది.

**రామ్మోహన్ నాయుడు స్పందన**

ఈ ఘటనపై పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు నాయుడు స్పందించారు. ఈ విషయమై ఎయిరిండియతో మాట్లాడామని, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించామని చెప్పారు. మావైపు నుంచి డీజీసీఏ సైతం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. మంత్రి శివరాజ్ సింగ్‌తో వ్యక్తిగతంగై మాట్లాడినట్టు చెప్పారు.

## ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలకు రంగం సిద్ధం..



**ఢిల్లీ:** ఢిల్లీ రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారి అసెంబ్లీ సమావేశం కానుంది. ఈ నెల 24వ తేదీన అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 24,25,27 వ తేదీల్లో ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. 24వ తేదీన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారంతో పాటు, అదే తేదీ మధ్యాహ్నం 2 గంటలకు స్పీకర్ ఎన్నిక జరుగనుంది. 25వ తేదీన లెఫ్టినెంట్ గవర్నర్ అసెంబ్లీలో ప్రసంగం ఉటుంది. ఇక 27వ తేదీ గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం చర్చ జరుగనుంది. మరొకవైపు 25వ తేదీన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రభుత్వంలో పెండింగ్ లో ఉంచిన కాగ్ రిపోర్ట్ ను సైతం అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. 25, 27 తేదీల్లో కాగ్ రిపోర్ట్ పై చర్చించే అవకాశాలు కనబడుతున్నాయి. తాము అసెంబ్లీ తొలి సెషన్ లోనే కాగ్ రిపోర్ట్ ను అసెంబ్లీలో ప్రవేశపెడతామని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కాగ్ రిపోర్ట్ ను అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వ నిధులను గత పాలకు దుర్వినియోగం చేశారని, ఎక్సైజ్ పాలసీలో అవతవకలు జరిగాయని కాగ్ నివేదిక పేర్కొన్న తరుణంలో దానికి ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న బీజేపీ.. కాగ్ నివేదికపై పదే పదే పట్టుబట్టింది. కానీ అది చివరకు అసెంబ్లీకి రాలేదు. దాంతో ప్రస్తుత బీజేపీ సర్కారు కాగ్ నివేదికను అసెంబ్లీ సాక్షిగా బహిర్గతం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో అపశ్రుతి

**నల్లగొండ :** సుదీర్ఘ విరామం తర్వాత పునఃప్రారంభమైన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో అపశ్రుతి చోటుచేసుకున్నది. శనివారం ఉదయం ఎడవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద ప్రమాదం జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో పనులు జరుగుతుండగా టన్నెల్ పైకప్పు 3 మీటర్ల మేర పడిపోయింది. దీంతో ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని రక్షించిన తోటి కార్మికులు హుటాహుటిన జెన్‌కో హాస్పిటల్‌కు తరలించారు. పోలీసుల సాహాయంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సొరంగంలోని రింగ్‌లు కిందపడటంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నది. దీంతో అందులో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మార్నింగ్ షిఫ్ట్‌లో 40 మంది కార్మికులు కార్మికులు పనిలోకి వెళ్లారు. ప్రమాదం అనంతరం సొరంగం నుంచి ఒక్కొక్కరిగా బయటకు వస్తున్నారు. ఘటనా స్థలం వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. ఐదేండ్ల విరామం తర్వాత ఈ నెల 18న సొరంగం తవ్వకం పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. స్ఎల్‌బీసీ ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విషయం తెలుసుకున్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఘటనా స్థలికి బయల్దేరారు. వారివెంట నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, అధికారులు ఉన్నారు. నల్లగొండ జిల్లాకు సాగు, తాగు నీరు అందించేందుకు శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ూఒఃఅ) సొరంగం ప్రాజెక్టును రూపొందించారు. 2005లో అప్పటి ప్రభుత్వం ప్రాజెక్టు పనులను ప్రారంభించింది. 60 నెలల్లో పనులు పూర్తి చేయాలని నిర్ధేశించారు. శ్రీశైలం నుంచి నల్లగొండ జిల్లాకు 30 టీఎంసీల కృష్ణా జలాలను తరలించాలన్నది ఈ ప్రాజెక్టు ఉద్దేశం. అయితే టన్నెల్ బోరింగ్ మిషన్‌తో సొరంగం తవ్వకం చేపట్టగా సాంకేతిక సమస్యలు, వరద సమస్యలతో పనులు ఆగుతూ సాగుతున్నాయి. కాగా, మొత్తం ఇన్ లెట్, అవుట్ లెట్ సొరంగాలు కలిపి 44 కిలోమీటర్లు తవ్వాల్సి ఉండగా.. 9.559 కిలోమీటర్ల తవ్వకం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం ఆరుసార్లు పనుల గడువు పొడించింది. తాజాగా 2026 జూన్ వరకు పనులు పూర్తిచేయాలని నిర్ధేశించారు. ప్రాజెక్టు అంచనాలను రూ.4,637 కోట్లకు పెంచారు. ఇప్పటిదాకా రూ.2646 కోట్లు ఖర్చుచేశారు. నల్లగొండలోని ఉదయ సముద్రం ప్రాజెక్టు కూడా ఈ ప్రాజెక్టులో అంతర్భాగం. కాగా, సొరంగం



పనులు పూర్తి చేస్తే జిల్లాలో 3.41 లక్షల ఎకరాలకు సాగునీరు, 200 గ్రామాలకు తాగునీరు అందనుంది.

**మట్టిపెల్లలు విరిగి కార్మికులపై పడ్డాయి.**

ఫస్ట్ షిఫ్ట్‌లో భాగంగా సుమారు 50 మంది కార్మికులు సొరంగంలో పనులు చేసేందుకు వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా.. ఒక్కసారిగా పైకప్పు కూలి మట్టిపెల్లలు విరిగి కార్మికులపై పడ్డాయి. టన్నెల్ నుంచి 50 మంది కార్మికుల్లో 42 మంది బయటకు రాగా.. మిగతా 8 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలి వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. పంజాబ్, జమ్మూ, యూపీ, జార?ండ్‌కు చెందిన కార్మికులు గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. గుర్‌జీత్ సింగ్(పంజాబ్), సన్నీత్‌సింగ్ (జమ్ముకశ్మీర్), శ్రీనివాసులు (యూపీ), మనోజ్ రూబెన (యూపీ), సందీప్ (ఝార?ండ్), సంతోష్ (ఝార?ండ్), జట్కా హీరాన్ (ఝార?ండ్) గుర్తించారు. అయితే బోల్టులు ఊడిపోవడంతో సిమెంట్ సెగ్మెంట్‌లు కూలాయి. మట్టిపెల్లలు విరిగిపడడంతో బురదలో కార్మికులు కూరుకుపోయారు. ఇప్పటి వరకు కార్మికుల ఆచూకీ లభ్యం కాలేదు. జనరేటర్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సొరంగ మార్గంలో దట్టమైన చీకటి, సహాయకచర్యలకు అంతరాయం నెలకొంది. సింగరేణి రెస్క్యూ టీం కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.

**కార్మికుల ఆచూకీ దొరకలేదు: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు చేరుకున్నారు. టన్నెల్ దగ్గర పరిస్థితిని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నకార్మికులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందజేయాలని వైద్యులకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ బురదలో 8 మంది కార్మికులు కూరుకుపోయారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గల్లంతైన కార్మికులు పంజాబ్, ఛత్తీస్‌గఢ్, జార?ండ్ చెందిన వారని అన్నారు. బోల్టులు ఊడిపోవడంతో సిమెంట్ సెగ్మెంట్‌లు కూలాయని చెప్పారు. ఇప్పటి వరకు కార్మికుల ఆచూకీ దొరకలేదని అన్నారు. జనరేటర్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. సొరంగ మార్గంలో దట్టమైన చీకటి, సహాయక చర్యలకు అంతరాయం నెలకొందని చెప్పారు. సింగరేణి రెస్క్యూ టీం కోసం అధికారులు ఎదురుచూస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు..

# బీసీలపై పెద్ద కుట్ర..

-మొదటిపేజీ తరువాయి

ఆ వివరాలు బయటకు చెప్పకుండా దాచి పెట్టుకున్నారు. రాజకీయాలకు ఆ వివరాలను కేసీఆర్ వినియోగించుకున్నారు. కానీ మేము అలా చేయలేదు. ప్లానింగ్ విభాగాన్ని నోడల్ ఏజెన్సీగా పెట్టుకుని సర్వే చేశాం. కేసీఆర్ చేసిన సమగ్ర సర్వే తప్పుడు సర్వే. ఎస్సీల్లో 56 కులాలు ఉంటే 86 కులాలుగా సమగ్ర కుటుంబ సర్వేలో చూపించారు. మేము చేసిన సర్వేను కొందరు తప్పుపడుతున్నారు. ఎక్కడ తప్పు ఉందో చెప్పండి. బీఆర్ఎస్, బీజేపీ కోర్టుల్లో కేసులు వేసి కులగణన ప్రక్రియను నిర్వీర్యం చేసే ప్రమాదం ఉంటుంది. వారికి ఆ అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే చేశాం

మోదీ బీసీ అని చెప్పుకుంటారు. 2011లో కాంగ్రెస్ చేసిన బీసీ సర్వే లెక్కలు బయట పెట్టాలి. బండి సంజయ్‌కు ప్రేమ ఉంటే ఆ లెక్కలు బయట పెట్టండి. బీసీలకు వాటా ఇవ్వాల్సి వస్తుందని బయట పెట్టడం లేదు. ప్రతీ రాష్ట్రంలో ఈ డిమాండ్ వస్తే దేశం మొత్తం చేయాల్సి వస్తుంది. బీసీల లెక్క తేలితే బీజేపీలో అధికారం చెలాయించే ఒకటి రెండు సామాజిక వర్గాలకు ఇబ్బంది అవుతుంది. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఇప్పటి వరకు వారి వివరాలు నమోదు చేసుకోలేదు. 50 శాతం ప్రజలు, అర శాతం ఉన్న వాళ్లను ప్రశ్నిస్తారని వాళ్ల భయం. అందుకే బీసీల సర్వేకు వారు సహకరించడం లేదు. కేసిఆర్ నాలుగు కేటగిరీల్లో లెక్కలు తీస్తే మేము ఐదు కేటగిరీల్లో వివరాలు తీశాం" అని రేవంత్ పేర్కొన్నారు.

"తప్పుడు లెక్కలు అని తప్పుడు మాట్లాడొద్దు. ఎక్కడ తప్పు జరిగిందో చెప్పండి. మేము పారదర్శకంగా సర్వే చేశాం. ఇది చరిత్రలో నిలిచి పోతుంది. మేము చేసిన సర్వే దేశానికే ఆదర్శం. సర్వే లెక్కలు బయట పెట్టొద్దని నా మీద కొందరు ఒత్తిడి కూడా తెచ్చారు. అయినా నేను పట్టించుకోలేదు. మన లెక్కలు తప్పని కొందరు తప్పుడు ప్రచారం చేస్తే మన వాళ్ళు మౌనంగా ఉండటం సరికాదు. రాహుల్ గాంధీ బీసీ కులగణనకు డిమాండ్ చేస్తే మోదీకి నష్టం. మోదీ పదవి పోతే బండి సంజయ్, కిషన్ రెడ్డి పదవులు పోతాయి. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, బండి సంజయ్, కిషన్ రెడ్డి సర్వే తప్పు అనడం కాదు. ఎక్కడ తప్పు ఉందో చూపించండి. ఇదంతా బీసీలపై జరుగుతున్న పెద్ద కుట్ర. సర్వే లెక్కల ప్రకారం ఎలా న్యాయం చేయాలని నేను ఆలోచిస్తున్నా"

సెకండ్ ఫేజ్ సర్వే పూర్తి అయిన తర్వాత దీనికి చట్టబద్ధత కల్పిస్తాం. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు జనాభా లెక్కలలోనే లేరు. వారి ఇంటి ముందు మేలుకొలుపు డప్పు కొట్టండి. లెక్కలు చెప్పకుండా ఫామ్ హౌస్ లో పన్నోడు మంచోడు. మీ లెక్కలు తీసిన నేను మంచోడిని కాదా. మీరు కూడా నన్ను విలన్‌గా చూస్తే ఎలా?. అసెంబ్లీలో సర్వేకు చట్టబద్ధత కల్పించే వరకే నా బాధ్యత.. దాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఇక బీసీల మీదే ఉంది. బీజేపీకి నా డిమాండ్. కేంద్రం చేసే జనగణనలో కుల గణన చేయండి. నేను చెప్పిన లెక్కలు తప్పని తేల్చండి. మార్చి 10 వరకు అన్ని కుల సంఘాల సమావేశాలు పెట్టుకోండి. తీర్మానాలు చేయండి. బీసీల లెక్కలు మోదీ వద్దంటున్నారు కాబట్టే.. బండి సంజయ్ వద్దు అంటున్నారు.

"మనం చేసిన సర్వేకు ప్రజామోదం కూడా ముఖ్యం. అన్ని సామాజిక వర్గాల సమావేశాలు పెట్టీ తీర్మానాలు చేయండి. యూనివర్సిటీల్లో విద్యార్థులు సెమినార్ లు నిర్వహించండి. బలహీన వర్గాలకు ఇదే భగవద్గీత, ఇదే ఖురాన్, ఇదే బైబిల్. ఇంతకంటే మించిన పాలసీ డాక్యుమెంట్ ఏది లేదు." అని రేవంత్ పేర్కొన్నారు.

**రాహుల్ గాంధీ ఆశయం మేరకే...!**

బీసీ కులగణన ఒక సాహసోపేత నిర్ణయమని, రాహుల్ గాంధీ ఆశయం మేరకే సమగ్ర కులగణన చేపట్టామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీసీ కులగణన సర్వేపై అనుమానాల నివృత్తిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కులగణన చేపట్టడం ద్వారా తమ ప్రభుత్వం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుందని అన్నారు. కులగణన విషయంలో భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

రాహుల్ గాంధీ సుమారు 25 రోజుల పాటు తెలంగాణలో పాదయాత్ర చేశారని, సోనియా గాంధీ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని తెలంగాణను ఇచ్చారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ మాట ఇచ్చిన తర్వాతే



ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. త్రికరణ శుద్ధిగా లెక్కలు తేల్చామని, వందేళ్లలో జరగని దానిని 100 శాతం సరైన లెక్కలను తేల్చామని ఆయన అన్నారు.

ఈ సర్వే పూర్తి పారదర్శకంగా జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వంలోని 15 శాఖలకు చెందిన అధికారుల ద్వారా, మొత్తం 8 పేజీలతో ఇంటి యజమాని ఇచ్చిన సమాచారాన్ని సేకరించామని తెలిపారు. సుమారు కోటీ పన్నెండు లక్షల కుటుంబాలు కులగణన సర్వేలో పాల్గొన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. న్యాయపరంగా, చట్టపరంగా, నిబంధనలకు లోబడి సర్వే చేసినట్లు చెప్పారు. 96.9 శాతం మంది సర్వేలో పాల్గొనగా, 3.1 శాతం మంది పాల్గొనలేదని తెలిపారు. కొంతమంది నాయకులు కులగణనకు దూరంగా ఉన్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ హయాంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో నాలుగు విభాగాలుగా జనాభా శాతాన్ని చెప్పగా, తాజా సర్వేలో 5 విభాగాలు ఉన్నట్లు చెప్పారు. ముస్లింలలోని ఓబీసీలను నాడు ప్రత్యేకంగా చెప్పలేదని ఆయన వెల్లడించారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిన అవశ్యకత ఉందని ముఖ్యమంత్రి అన్నారు.

రాహుల్ గాంధీ ప్రధాని అయితే అన్ని రాష్ట్రాల్లో కులగణన జరుగుతుందని జోస్యం చెప్పారు. కులగణన జరగకపోతే బీసీలు నష్టపోతారని హెచ్చరించారు. మంచి చేసిన తనను రాళ్లతో కొడతామంటే నష్టపోయేది బీసీలే అన్నారు.

బీసీ జనాభా ప్రకారం వారికి అవకాశం కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కులగణనకు చట్టబద్ధత కల్పిస్తామని తెలిపారు. "బీసీ మిత్రులకు నా విజ్ఞప్తి. మీ కోసం నేను నా శక్తి మేరకు సాహసం చేశా. దీనిని సొంతం చేసుకోవాల్సిన బాధ్యత మీదే" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## చంద్రబాబు చేతిలో రేవంత్ కీలు బొమ్మ

**నిజామాబాద్ :** బనకచర్ల ప్రాజెక్టు వెనుక కుట్ర దాగి ఉందని, ప్రజా భవన్ లో ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశం తర్వాత చంద్రబాబు ప్రకటన చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. నిజామాబాద్ పసుపు మార్కెట్ యార్డును ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. ఈ సందర్భంగా పసుపు రైతుల సమస్యలు, పసుపు ధరలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరు రాష్ట్రాల సీఎంలు ప్రజా భవన్ లో సమావేశం అనంతరం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు చేపడుతామని ప్రకటించారు. ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బ్రీఫ్ చేసిన తర్వాతనే ఈ ప్రకటన వచ్చింది. గోదావరి నుంచి 200 టీఎంసీలు తరలించడానికి ఏపీ బనకచర్ల ప్రాజెక్టు చేపడుతోంది. తెలంగాణ దగ్గరి నుంచి నీటిని ఏపీ ఎత్తుకపోతుంటే చేతకాని సీఎం రేవంత్ రెడ్డి చూస్తూ నిలబడ్డారు. ఎందుకంటే నోట్ల బ్యాగుతో దొరికిన రేవంత్ రెడ్డి జుట్టు ఏపీ సీఎం చంద్రబాబు చేతిలో ఉంది. చంద్రబాబుకు కేంద్రం మద్దతు ఉంది. అందుకే కేంద్రం, ఏపీ ఎలా చెబితే రేవంత్ రెడ్డి అలా ఆడతారు. తెలంగాణ మంచి కోరినట్లయితే చంద్రబాబు ప్రాజెక్టు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ కేంద్రానికి లేఖ ఎందుకు రాయడం లేదు. రాష్ట్రానికి నష్టం జరుగుతుందని తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టుల్లో కేసులు వేయకపోవడంతో అనుమానాలు నిజమయ్యాయి. ఆనాడు ఏపీ ప్రాజెక్టులు చేపడితే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యతిరేకిస్తూ కేంద్రానికి లేఖలు రాశారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ రైతుల కంటే చంద్రబాబుపై ఎక్కువ ప్రేమ ఉందా ? ఈ విధంగా గురుదక్షిణ చెల్లించుకుంటున్నారా ?. రాష్ట్ర రైతుల ఉసురు తీసి గోదావరి, కృష్ణా జలాలు ఏపీకి ఇచ్చి గురుదక్షిణ చెల్లించుకుంటున్నారా ?. తక్షణమే సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి రాయాలి. అవసరమైతే కోర్టుకు వెళ్లి బనకచర్ల ప్రాజెక్టును ఆపే ప్రయత్నం చేయాలి. కేంద్రం నామమాత్రంగా పసుపు బోర్డు ఏర్పాటు ఏర్పాటు అంటూ గెజిట్ జారీ చేసింది. ఆ పసుపు బోర్డుకు చట్టబద్ధత లేదు. కనుక పసుపు ధరలు పడిపోయే అవకాశం ఉంది. ఒకవేళ పసుపు బోర్డుకు చట్టబద్ధత ఉంటే బయటి దేశాల నుంచి నాసిరకం పసుపు దిగుమతులు తగ్గుతాయి. స్థానిక రైతుల పసుపునకు మంచి రేటు లభిస్తుంది. నాలుగైదు రోజులు ఎదుచూసినా పసుపు కొనడం లేదు. సిండికేట్ గా మారి పసుపు ధర తగ్గిస్తున్నారు. ఎంత నాణ్యత ఉన్నా పసుపునకు ధర లభించడం లేదు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ పసుపునకు 12 వేల కనీస ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. దాని కంటే తక్కువ ధర ఉంటే బోనస్ రూపంలో మిగతా డబ్బును ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. పసుపుకు తక్షణమే బోనస్ ప్రకటించాలని మా డిమాండ్. పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించడంతో పాటు, కనీస మద్దతు ధర ఇచ్చే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది. మార్చి 1వ తేదీలోపు పసుపు పంటకు బోనస్ ప్రకటించకపోతే జిల్లా కలెక్టరేట్ ను దిగ్భందిస్తాం' అని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. రేవంత్ రెడ్డి సీఎం కావడం తెలంగాణ ఖర్మ తనపై చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత కౌంటర్ ఇచ్చారు. 'ఆఖరికి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా రేవంత్ తీరు మారలేదని,

## పోలీస్ శాఖ అవసరాలు తీరుస్తాం

-మొదటిపేజీ తరువాయి

ఆయన పలు అంశాలపై పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు. తెలంగాణ రాష్ట్రం శర వేగంగా అభివృద్ధి చెందుతుంది, నగర రాజ్యముగ రాష్ట్రం స్థిరపడుతుంది అని వివరించారు. హైదరాబాదులో ప్రస్తుతం ఉన్న మూడు నగరాలకు తోడు నాలుగవ నగరం ఫ్యూచర్ సిటీ సైతం సిద్ధం అవుతుంది, రీజినల్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఆర్థిక వనరులు, వాతావరణం, ఉపాధి అవకాశాల నేపథ్యంలో పెద్ద ఎత్తున హైదరాబాద్ కు, రాష్ట్రానికి వలసలు పెరుగుతున్నాయని ఈ మేరకు భద్రత విషయంలో హోం శాఖ సిద్ధం కావాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. సరిహద్దుల్లో ఉండే సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కరిస్తామని పోలీసు ఉన్నతాధికారులకు డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు మంచి పేరు ఉంది, ప్రధానంగా సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం విషయంలో దేశంలో అగ్రస్థానంలో ఉన్నారు అందుకు ఉన్నతాధికారులు, సిబ్బందికి డిప్యూటీ సీఎం అభినందనలు తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నివాసానికి క్వార్టర్స్ నిర్మించాల్సిన అవసరం ఉందని, రాష్ట్రంలో ఎక్కడెక్కడ పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి అవకాశం ఉందో వెంటనే ప్రతిపాదనలు పంపించాలని డిప్యూటీ సీఎం పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. సి ఎస్ ఆర్ నిధులు సమీకరించేందుకు అవకాశం ఉన్న ప్రతి చోట అధికారులు ప్రయత్నం చేయాలని, పోలీస్ శాఖ బలోపేతానికి వాటిని వినియోగించుకోవాలని సూచించారు. గత ఏడాది కాలంగా పోలీస్ శాఖలో భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య, ప్రస్తుతం ఉన్న ఖాళీల వివరాలు పైన సమీక్షించారు. గ్రేహౌండ్స్, నార్కోటిక్స్, ఇంటలిజెన్స్, ఫైర్, ఎక్స్ సర్వీస్ మెన్ మొత్తం ఎనిమిది విభాగాల ఉన్నతాధికారులు వారి బడ్జెట్ అవసరాల పై సమావేశంలో నివేదిక సమర్పించారు. డిజిపి జితేంద్ర మొత్తం శాఖ పరంగా రానున్నయ్యడానికి అవసరమైన బడ్జెట్ పై నివేదిక సమర్పించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రవి గుప్తా, డీ జీఅభిలాష్ బిస్త్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, హైదరాబాద్ సిటీ కమిషనర్ సివి ఆనంద్, రాచకొండ సి పి సుధీర్ బాబు, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

**బీసీ సర్వేతో బీఆర్ఎస్ కు నష్టం**

**హైదరాబాద్ :** ప్రజా భవన్ లో బిసి నేతల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే సామాజిక న్యాయం జరుగుతుందని ప్రతి ఇంటికి ప్రచారం చేయండి. ఈ దేశంలో ఇప్పటివరకు బీసీ జన గణన సైంటిఫిక్ గా తేల్చలేదు.. మొదటిసారి తేల్చింది తెలంగాణ ప్రభుత్వమే నని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన బీసి జన గణనను ఏ సర్వే తోనూ పోల్చలేరు. 2011లో జరిగిన జన గణన లో కేవలం ఎస్సీ, ఎస్టీ, ఇతర జనాభా లెక్కలే తేల్చారు. కెసిఆర్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే అధికారికం కాదు. దానిని క్యాబినెట్లో పెట్టలేదు, శాసనసభలో చర్చకు పెట్టలేదు. కాబట్టి అది చెల్లుబాటు కాదు. దేశంలో మొదటిసారి బీసీ జనాభాను అధికారికంగా లెక్క తేల్చి ముద్ర వేశాం. దీనిని ఆయా వర్గాల ప్రయోజనం కోసం ఎలా ముందుకు తీసుకువెళ్లాలనేది బీసీ ప్రజా ప్రతినిధులు, సంఘాలు ఆలోచన చేయాలి. బీసీ సర్వే అధికారికంగా జరగడం మూలంగా టిఆర్ఎస్ కు నష్టం. కాబట్టి సర్వే బాగాలేదని ప్రచారం చేసి బీసీ లబ్ధిదారులకు ప్రయోజనం దక్కకుండా ఆ పార్టీ రాజకీయం చేస్తుంది. తెలంగాణలో బీసీ సర్వే విజయవంతం అయితే దేశవ్యాప్తంగా చేయాల్సి వస్తుంది. బిజెపి పై ఒత్తిడి పెరుగుతుందని ఆ పార్టీ నేతలు సర్వేపై దుష్ప్రచారం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పై ఒత్తిడి ఉన్నప్పటికీ. రాహుల్ గాంధీ నా నాయకుడు ఆయన ఏ జెండానే నా ఎజెండా. నాకు వచ్చిన ఉద్యోగాన్ని సామాజిక న్యాయం చేయడానికి ఉపయోగిస్తా అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. వారికి నా అభినందనలు. సర్వే పారదర్శకంగా జరగాలని, ఈ అంశాన్ని సీరియస్గా తీసుకోవాలని, ఎక్కడ రాజీ పడవద్దని ప్రణాళిక శాఖ చూస్తున్న నాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారు. సర్వేపై ఎవరు ఏ ప్రశ్న అడిగినా అధికారికంగా సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అన్ని ఆధారాలు అధికారికంగా నిక్షిప్తం చేశాం. 8 కోట్ల పేజీలకు పైబడిన సమాచారం సర్వే ద్వారా సేకరించామని అన్నారు.

## రేవంత్ రెడ్డి దివాళాకోరు.. అబద్ధాల రాయుడు

**హైదరాబాద్ :** తెలంగాణ ఆర్థిక ప్రగతిపై ముఖ్యమంత్రి రేవంత్ మూతి మీద తన్నెటట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వాస్తవాలు చెప్పారన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. మోడీ తలకిందులుగా తపస్సు చేసినా, రాహుల్ గాంధీ వంద జోడో యాత్రలు చేసినా కేసీఆర్ లెక్క రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేరన్నారు. తెలంగాణ దివాళా తీసిందని రేవంత్ రెడ్డి చెప్పినవన్నీ పచ్చి అబద్దాలే అని స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే స్టేట్ స్టాటిస్టికల్ అట్లాస్ నివేదికలో ఒప్పుకుందన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ గత 15 నెలలుగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రేవంత్ రెడ్డి నుంచి మొదలుపెడితే ప్రతి కాంగ్రెస్ నాయకుడు ఒక ఎజెండా ప్రకారం గోబెల్స్ వారసుల్లాగా తెలంగాణ ఆర్థిక ప్రగతిపై దుష్ప్రచారం చేస్తున్నరు. రాష్ట్రం దివాలా తీసింది అని రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పాడు. రేవంత్ రెడ్డి లాంటి దివాలా కోరు ముఖ్యమంత్రి ఈ దేశంలో ఎవరూ లేరు.రేవంత్ రెడ్డి చెప్తున్నవి అబద్ధాలని బట్టి విక్రమార్క ఫిబ్రవరి 17 నాడు ఒక సమగ్ర నివేదికను విడుదల చేశారు. ష్ట్ర ప్రభుత్వం సాధికారికంగా విడుదల చేసిన నివేదిక అది. రేవంత్ రెడ్డి చెప్పిన అబద్ధాలను తిప్పికొడుతూ, సమగ్రమైన నివేదిక ఇచ్చినందుకు భట్టి విక్రమార్క కి ధన్యవాదాలు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలుసుకోకుండా ఏది పడితే అది మాట్లాడి ముఖ్యమంత్రి తెలంగాణ పరువు తీస్తున్నాడు. కేసీఆర్ కి మంచి పేరు వస్తుందని తెలుసుకుని వెబ్సైట్ నుంచి రిపోర్టును డిలీట్ చేసింది ఈ ప్రభుత్వం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇన్ని రోజులు కాంగ్రెస్ నేతలు చెప్పినవన్నీ పచ్చి అబద్దాలని ఈ నివేదిక తో తెలుస్తుంది. తలసరి ఆదాయంలో 2014 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో 10వ స్థానంలో ఉంది. 2023 నాటికి తలసరి ఆదాయంలో భారత దేశంలోనే నంబర్ వన్ స్థానంలో తెలంగాణ ఉందని ఈ నివేదిక చెప్తుంది. 2014- 15లో దేశ తలసరి ఆదాయం సగటు 86,000 ఉంటే తెలంగాణ తలసరి ఆదాయం 1,24,000 ఉండేది.ఈ నివేదిక ప్రకారం భారతదేశం మొత్తం సగటు కంటే రెండు రెట్లు ఎక్కువగా తెలంగాణ తలసరి ఆదాయం సగటు ఉంది. కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణలో సంపద ఎలా పెరిగింది ? ఎలా అభివృద్ధిలో పురోగమించింది? ఎలా దేశానికి ఆదర్శంగా మారిందో ఈ నివేదిక స్పష్టం చేసింది. తెలంగాణ దివాలా తీసింది అని దివాలాకోరు మాటలు మాట్లాడిన సన్నాసుల నోర్లు మూయించే విధంగా ఈ నివేదిక వాస్తవాలను బయటపెట్టింది. తలసరి ఆదాయంలో మాత్రమే కాదు జిడిపిలో భారతదేశానికి కాంట్రిబ్యూటర్ గా దేశానికి ఏ విధంగా అన్నం పెడుతుందో ప్రగతిశీల విధానాలతో, కులం మతం పంచాయతీలు లేకుండా తెలంగాణ ఎలా పురోగమించిందో , ఎట్లా సంపద సృష్టించిందో ఈ నివేదిక తెలియజేస్తుంది.2013 -14 లో భారతదేశ జిడిపిలో తెలంగాణ వాటా నాలుగు శాతంగా ఉంటే, కెసిఆర్ ముఖ్యమంత్రిగా దిగిపోయే సమయానికి అది పెరిగి 5.1 శాతంగా ఉందని నివేదిక స్పష్టం చేసింది. మనకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న దానికంటే మనమే ఈ దేశానికి రెట్టింపు ఆదాయాన్ని ఇస్తున్నామని అన్నారు.

## సీఎం రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నా

-మొదటిపేజీ తరువాయి

బీజేపీ వ్యతిరేకం కాదు. రిజర్వేషన్‌లను స్వాగతిస్తాం. ముస్లింలను బీసీ జాబితాలో చేరిస్తే వ్యతిరేకిస్తాం. బీజేపీ తో బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధాలు లేవు. కాంగ్రెస్‌తో కలిసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. గతంలో అనేక సార్లు బీఆర్ఎస్ కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది. జిల్లా అధ్యక్షుల



నియామకాల ప్రక్రియ తర్వాతే రాష్ట్ర అధ్యక్షుని ఎంపిక" ఉంటుందని కిషన్‌రెడ్డి తెలిపారు. 14 నెలల్లో కాంగ్రెస్ ప్రజలకు ఓరగబెట్టింది ఏమీ లేదు. అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు శాసన మండలి ప్రాధాన్యతను తగ్గించాయి. ప్రజా సమస్యల పోరాటానికి శాసన మండలి వేదిక. కుల గణనకు బీజేపీ వ్యతిరేకం కాదు. ముస్లింలను బీసీ లో చేర్చే కుట్ర జరుగుతుంది. దానికి వ్యతిరేకం" అని కిషన్‌రెడ్డి చెప్పారు.

## సంపాదకీయం

# విద్య, పరిశోధన రంగానికి చేయూత

భారత ప్రభుత్వం ప్రారంభించిన 'ఒన్ నేషన్- వన్ సబ్‌క్రిప్షన్' (ఒఎన్ఒఎస్) పథకం అనేది. విద్యా పరిశోధనా రంగాన్ని ప్రజాస్వామ్యీకరణకు ఉపయోగపడే గొప్ప సాధనా సంపత్తి. ఇది దేశంలో జ్ఞాన సమగ్రతకు, నూతన పరిశోధనా ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించడానికి ఒక మైలురాయిగా చరిత్ర లో నిలిచిపోతుంది. ఈ పథకం ద్వారా దేశంలోని విద్యార్థులు, పరిశోధకులు, ఫ్యాకల్టీ సభ్యులు అంతర్జాతీయ స్థాయిలోని అకాడమిక్ జర్నల్స్‌ను ఇతర పరిశోధనా వనరులను ఏకీకృతంగా అందుకోవడానికి అవకాశం కల్పించబడింది. ఈ పథకం 2025 జనవరి 1న ప్రారంభించబడింది. ఇది భారతదేశ పరిశోధనా నేపథ్యాన్ని గణనీయంగా మార్చివేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ పథకం ప్రధాన లక్ష్యం ఏమిటంటే, అన్ని విద్యా సంస్థలకు, అలాగే పరిశోధనా కేంద్రాలకు అత్యధిక నాణ్యత గల పరిశోధనా వనరులను అందించడం. చిన్న నగరాలు, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న సంస్థలకు కూడా ప్రపంచస్థాయిలోని పరిశోధనా వనరుల లభ్యత కల్పించడం ద్వారా, జ్ఞాన సముపార్జనా అంతరాలను తొలగించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఇది ఒకేసారి అనేక సంస్థలకు సమాచార వితరణకు సమాన అవకాశాలను అందిస్తుంది. ఈ సంస్థ ద్వారా అతి తక్కువ ఖర్చుతో, అత్యధిక జ్ఞాన సముపార్జనా సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. అలాగే పరిశోధనా రంగంలో రీసర్చ్ స్కాలర్లకు అవసరమైన అనంత సమాచారం వివిధ వనరుల ద్వారా లభిస్తుంది. వివిధ శాఖల్లో పరిశోధనలు సమాంతరంగా జరుపుకోవచ్చు. వివిధ శాస్త్రాలలో జరిగే పరిశోధనలకు అవసరమైన సమాచారం ఒకే చోట లభించట వల్ల డేటా కలెక్షన్‌కు వెచ్చించవలసిన ఆర్థిక వనరులను పొదుపు చేసి, అవసరమైతే ఆ మిగులను ఇతర కీలక రంగాలకు మళ్లించడానికి అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా, ఈ పథకం వివిధ అకాడమిక్ రంగాలకు అవసరమైన వనరుల లభ్యతను అందించడం ద్వారా, ఇంటర్ డిసిప్లీనరీ రంగాలలో అధ్యయనాలను ప్రోత్సహిస్తుంది. ఇది పరిశోధకులకు విస్తృత దృక్కోణాలలో సమాచారం అన్వేషించడానికి, వినూత్న పరిశోధనల ఫలితాలను ఆవిష్కరించటానికి నూతన మెథడాలజీ రూపాలను (మోడల్స్‌ను) రూపొందించడానికి అవకాశం కల్పిస్తుంది. ఈ పథకం అమలును వివిధ దశల్లో చేయటానికి ముందుగానే నిర్దిష్ట ప్రణాళికలు చేయాల్సి ఉంటుంది. మొదటి దశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నడుస్తున్న అన్ని ఉన్నత విద్యా సంస్థలను, అలాగే పరిశోధనా సంస్థలను, వాటి ప్రయోగశాలలకు వనరుల లభ్యత అందించబడుతుంది. రెండవ దశలో ప్రైవేట్ విద్యాసంస్థలకు, పబ్లిక్- ప్రైవేట్ పార్టనర్షిప్ మోడల్ ద్వారా ఈ పథకాన్ని విస్తరించడం కోసం ప్రణాళిక సిద్ధం చేయబడింది. చివరి దశలో ప్రజా గ్రంథాలయాల ద్వారా సాధారణ ప్రజలకు కూడా ఈ వనరులను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా స్వతంత్ర పరిశోధకులకు, స్వతహా జ్ఞానాన్వేషకులకు కూడా ప్రపంచ స్థాయిలోని అకాడమిక్ వనరులను సమర్థవంతంగా ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. ఈ పథకం విస్తృతి, పరిధి చాలా ఆకర్షణీయంగా ఉంది. ఇది సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్ వంటి వివిధ రంగాలలో 13,000 కంటే ఎక్కువ అంతర్జాతీయ జర్నల్స్ కవరేజ్ కలిగి ఉంది.ఈ పథకం కీలక విజయాలలో ఒకటి ఏమిటంటే, ఎల్సెవియర్, స్ప్రింగర్ నేచర్, వైలీ, టేలర్ ఫ్రాన్సిస్, (ఐఇఇఇ) వంటి 30 ప్రముఖ అంతర్జాతీయ ప్రచురణ సంస్థలతో ఒప్పందాలు చేసుకోవడం. ఈ ఒప్పందాల ద్వారా, ఒక్కో సంస్థ ప్రత్యేకంగా జర్నల్ సబ్‌స్క్రిప్షన్లు కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా, అన్ని సంస్థలకు సమాన ప్రాప్యత కల్పించబడుతుంది. ఈ పథకం ప్రయోజనాలు పరిశోధనా వనరులకు లభ్యత విలువ చాలా ఎక్కువ.ఈ సంస్థ విద్యార్థులకు, ఫ్యాకల్టీ సభ్యులకు తాజా అకాడమిక్ జ్ఞానాన్ని అందించడం ద్వారా భారతదేశ పరిశోధనా సామర్థ్యాలను బలోపేతం చేస్తుంది. అలాగే పరిశోధనా ఫలితాల నాణ్యతను మెరుగుపరుస్తుంది. ఇది ముఖ్యంగా ద్వితీయ, తృతీయ స్థాయి నగరాలలోని సంస్థలకు, ప్రజలకూ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇక్కడ ఖరీదైన అరుదైన పరిశోధనా ఫలితాలను ప్రచురించే జర్నల్స్ దొరుకుతాయి. అంతేకాకుండా, ఈ పథకం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఇపి) 2020లో పేర్కొన్న లక్ష్యాలకు మద్దతు ఇస్తుంది. ఇది పరిశోధనలకూ, వినూత్న ఆవిష్కరణకు జాతీయ అభివృద్ధికి దోహదపడే కీలక అంశాలు, అవకాశాలు విస్తృతంగా లభిస్తాయి. ఈ సంస్థ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎఎన్ఆర్ఎఫ్) లక్ష్యాలతో కూడా అను సంధానం చేయబడి వాటి కార్యక్రమాలను సమన్వయం చేస్తుంది. ఇది భారతదేశంలో బలమైన పరిశోధనా సంస్కృతిని ప్రోత్సహించడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం మరొక ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే, ఇది ఖర్చు సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. కేంద్రీకృత సబ్‌స్క్రిప్షన్ల ద్వారా ప్రభుత్వం ప్రచురణ సంస్థలతో మెరుగైన ఒప్పందాలను చేసుకోగలుగుతుంది. తద్వారా విద్యా వ్యవస్థపై మొత్తం ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. ఈ పథకం ద్వారా సేవింగ్ చేసిన డబ్బును పరిశోధన, అభివృద్ధికి అవసరమైన ఇతర కీలక రంగాలకు మళ్లించవచ్చు. అంతర్జాతీయ సంస్థల సహాయ సహకారాలను కూడా తీసుకొని జ్ఞాన-భాగస్వామ్య సంస్కృతిని పెంపొందించడానికి దోహదం చేస్తుంది. ఈ పథకం అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రశంసలు అందుకుంది. పరిశోధనా లభ్యతను జాతీయ స్థాయిలో అందించడానికి భారతదేశం చేసిన కృషిని ప్రపంచవ్యాప్తంగా నిపుణులు, విధాన రూపకర్తలు ప్రశంసించారు. ఈ పథకం అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలకు కూడా ఒక మార్గదర్శకంగా నిలుస్తుంది, ప్రత్యేకించి ఖరీదైన జర్నల్ సబ్‌స్క్రిప్షన్ల వల్ల పరిశోధన ప్రగతి అడ్డుపడుతున్న దేశాలకు ఈ పథకం యొక్క భవిష్యత్ అవకాశాలు చాలా ఆశాజనకంగా ఉన్నాయి. కానీ దీని దీర్ఘకాలిక విజయం కోసం నిరంతర పర్యవేక్షణ అవసరం. పరిశోధకులు ఇతర సంస్థల నుండి సాధారణ అభిప్రాయాలు సేకరించడం ద్వారా, లభ్యమయ్యే సేవల విధానాలను మెరుగుపరచడం సాధ్యమవుతుంది. మెరుగైన సబ్‌స్క్రిప్షన్ల ఒప్పందాలను చేసుకోవడం సాధ్యమవుతుంది. టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశోధనా సాధనాలు, అధునాతన డిజిటల్ లైబ్రరీలను ఈ పథకంలో ఏకీకృతం చేయడం ద్వారా దాని ప్రభావాన్ని మరింత పెంచవచ్చు. ఒక వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచ జ్ఞాన ఆర్థిక వ్యవస్థలో పరిశోధనకు సమాన ప్రాప్యత ఇప్పుడు ఒక విలాసవంతమైన అంశం కాదు, అవసరమైన అంశం.

# సంకీర్తనాచార్యులకు మార్గదర్శకుడు



దక్షిణా పథాన భజన సాంప్రదాయానికి, పద కవితా శైలికి ఆద్యుడు, ఆరాధ్యుడు, తెలుగు సాహితీ చరిత్రలో ప్రథమ వాగ్గేయ కారుడు అన్నమాచార్యుడు. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనాచార్యులకు మార్గ దర్శకుడైన, భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం భావలాలిత్యంతో నిండిఉన్న అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలు తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయి. తెలుగు సంస్కృతితో విడదీయరాని బంధాన్ని ఏర్పరచుకున్నాయి. ఆధ్యాత్మిక పదాలు, శృంగార గీతాలు, తుమ్మెదల, గొబ్బిళ్ళ పాటలు, శతకాలు, అన్నమయ్య విరచిత, 32 వేల ఆశుకవితా రూపాలలో చాలా వరకు లభ్యాలై, ప్రజల నోళ్లలో నానుతునే ఉన్నాయి. కన్నడ వాగ్గేయకారుడు "పురందరదాసు" అన్నమయ్యను, ఏడుకొండల స్వామి అవతారంగా ప్రశంసిస్తే, మహావిష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని, శ్రీ వైష్ణవ సాంప్రదాయ ఆచరణుల నమ్మకం. అన్నమయ్య మనుమడు తాళ్ళపాక చిన్నన్న రాసిన "అన్నమయ్య చరితం" ద్విపద కావ్యం ద్వారా ఆయన సమాచారం లభిస్తున్నది. క్రీస్తుశకం పదవ శతాబ్దిలో, నేటి కర్నూలు జిల్లాలోని ప్రాంతాలను నందుడనే రాజు పాలించగా, ఆ రాజు కాశీయాత్ర సమయాన, కాశీలో కొందరు వైదిక బ్రాహ్మణులు పరిచయం కాగా, కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు ఆంధ్రదేశానికి తరలి వచ్చి స్థిరపడగా, తీసుకొని రాబడిన వారు వైదీకులు అయినందున, నంద వైదీకులుగా ప్రచారం పొందినట్లు, అన్నమయ్య అదే కోవకు చెందిన వారై, "తాళ్ళపాక గ్రామం" ఇంటి పేరుగా కలిగి ఉన్నారని ప్రచారం ఉంది. వైశాఖ మాసం విశాఖ నక్షత్రంలో శుభ లగ్నాన, మూడు గ్రహాలు ఉచ్చ స్థితిలో ఉండగా, నారాయణ సూరి - లక్కమాంబలకు "నందకం" అంశమున సర్వధారి సంవత్సర వైశాఖ శుక్ల పౌర్ణమి నాడు 1408 మే 9న అన్నమయ్య ఉదయించారు. నారాయణమూర్తి పరబ్రహ్మ వాచకంగా "అన్నమయ్య" అని నామకరణం గావించారు. "అన్నమయ్య", "అన్నమాచార్యులు", "అన్నయ గురు", "అన్నయ్య", "కోనేటి అన్నమయ్యం గారు" అనే నామాంతరం తాళ్లపాక సాహిత్యం శాసనాలలో చోటు చేసుకున్నాయి. శిశు ప్రాయం నుండి అన్నమయ్య వెంకట నాథుని మీద ధ్యాస ఉంచేవారు. ఉగ్గు పాలు తాగడంలో, నిద్రకు ఉపక్రమించడంలో, లక్కమాంబ గీతాలు, జోల పాటలు, నారాయణ మూర్తి కావ్య పఠనాలు, అన్నమయ్యపై శైశవ దశలోనే ప్రభావం చూపాయి. ఏకసంతాగ్రాహియై, ఉపనయన సంస్కారం అనంతరం చిరు ప్రాయం నుండే, కలియుగ దైవంపై వింత వింత సంకీర్తనలు నోటి నుండి జాలు వారగా, పదహారేళ్ల ప్రాయం నుండి రోజు కొక్క సంకీర్తనం తప్పక రాయడం మానలేదు. చెరువుగట్టు మీద, చెట్టుపై పిట్టలు, చిరుగాలి సవ్వడులలో, అలల కదలికలలో, మమేకమై సాగిన ఆయన జానపద నేపథ్యంలో, అన్నమయ్య పాటన్నా, మాటన్నా, గ్రామీణులకు సంబరాన్ని కలిగించేవి. ఉమ్మడి కుటుంబంలో, పనులు చేయడం నచ్చక, లౌకిక బంధాలతో, తమకు ఇక పనిలేదని తెలుసుకొని, వేదనలో విరక్తి కలిగి, భక్తి రగిలి, భక్తి రసావేశ భరితులై, తంబుర చేతబూని, తిరుమల దారి పట్టా డు. సనక సనందాదులే భక్తులై తోడురాగా తిరుపతి చేరారు. సకలాభరణ శోభితుడు, భూషితుడు అయిన శ్రీ మూర్తిని దర్శించుకున్నారు. తిరుమలలో "ఘన విష్ణువు" అనే మునితో శంఖ చక్రాదికములతో, పంచ సంస్కారాలను నిర్వహింప చేసుకున్నారు. వైష్ణవ తత్వాలను, ఆళ్వారుల దివ్య ప్రబంధాలను, అధ్యయనం చేస్తూ, వెంకన్నను కీర్తిస్తూ, తిరుమలలోనే జీవితం గడిపారు. గురువు ఆనతిపై, తాళ్ళపాక వెళ్లి తిమ్మక్క, అక్కమ్మలను వివాహం చేసుకున్నా, వారితో తిరిగి తిరుమల దర్శనం చేసుకున్నారు. 95 ఏళ్ళ పూర్ణ వయస్కుడై, అన్నమయ్య దుందుభి నామ సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి 1503 ఫిబ్రవరి 23న పరమపదించారు. అన్నమయ్య సంకీర్తనా సేవ, సంగీత సాహిత్య భక్తి పరిపుష్టం. తెలుగు లోనే రాసినా పాడినా ఆయన సాహిత్యం సంస్కృత పద భూయిష్టం. అన్నమయ్య యోగ వైరాగ్య శృంగారం సరణి మొత్తం 32 వేల సంకీర్తనలు రచించారని అనుకొంటున్నా, ఆయన వారసులు రాగి రేకులపై వ్రాయించి, తిరుమలలో సంకీర్తనా భాండాగారం నందు పొందు పరిచినవి, ప్రస్తుతం 12 వేలు మాత్రమే. మంజరి ద్విపదలో "శృంగార మంజరి" అనే కావ్యాన్ని రచించారు. ఆయన రచనలని చెప్పబడే 12 శతకాలలో "వెంకటేశ్వర శతకము" మాత్రమే లభిస్తున్నది. "అదివో అల్లదివో, క్షీరాబ్ధి కన్యకకు, జో అచ్యుతానంద, ఉదయాద్రి తెలిపాయే, కొండలలో నెలకొన్న, మూసిన ముత్యాల, నిగమ నిగమాంత, లాంటి అన్నమయ్య కీర్తనలు, తెలుగు సంగీతాభిమానులకు, నిత్యం వీనులకు విందు చేస్తూనే ఉన్నాయి. "సంకీర్తనాచార్యుడు", "పదకవితా పితామహుడు", "పంచమాగమ సార్వభౌముడు", "ద్రావిడ ఆగమ సార్వభౌముడు"అని బిరుదాంకితుడు అయిన, అన్నమయ్య వాసిలో, రాశిలో, రచనలు ఆంధ్ర వ్మాయంలో సరిరానివి అనడంలో అతిశయోక్తి లేదు.

# నిబంధనల మేరకు చట్టబద్ధత శ్రేష్ఠం

అనాథలకు 'దత్తత' ఓ వరం. తెగిన గాలిపటంలా పయనిస్తున్న జీవితానికి ఆసరా దొరకడం పునర్జన్మగా భావించాలి. పెంచే తల్లిదండ్రులను పొందే అవకాశం కలగడం పిల్లలకు అంతకంటే కావల్సిందేముంటుంది. అలాగే పిల్లల కోసం తపించే తల్లిదండ్రులకు అదొక కల. సంవత్సరాలుగా వేధిస్తున్న సంతానలేమి, అమ్మ పిలుపుకోసం ఆరాటం వెరసి కుటుంబ సంరక్షణలో లేని అనాథలకు కొత్తజీవితం అందివస్తుంది. అయితే ఈ దత్తత పెద్ద ప్రహసనంగా మారింది. దత్తత ప్రక్రియకు కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ (సిఎఆర్ఎ కారా) పర్యవేక్షణలో నడుస్తోంది. వీటి నియమ నిబంధనలు చాలా మంది దంపతులకు ఆటంకంగా మారాయి. నిబంధనలు పాటించకుండా చిన్నారులను దత్తత పొందడం నేరం చేయడమవుతుంది. తల్లిదండ్రుల్లేని, సంరక్షణ కొరవడిన చిన్నారులను దత్తత ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిబంధనలు సులభతరం చేసింది. దత్తతకు ఎంపికకాని చిన్నారులను సంరక్షణ కేంద్రాలకు పరిమితమవుతున్నారు. దేశీయంగా గుర్తింపు పొందిన సంరక్షణ కేంద్రాల్లో సుమారు 66 వేల మంది పిల్లలు ఉన్నారు. అనాథ పిల్లలు, తప్పిపోయిన వారిని వెంటనే దత్తత ఇవ్వడానికి వీల్లేదు. ఆ పిల్లల అసలు తల్లిదండ్రుల కోసం వెతికి వారు దొరకనప్పుడు మాత్రమే దత్తతకు అర్హులవుతారు. దత్తత ప్రక్రియ నాలుగు నెలల్లో పూర్తి కావాలి. కానీ, అధికారుల అలసత్వం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోంది. ఒక్కోసారి మూడు నాలుగేళ్ల కాలం పడుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో 3,010 మంది పిల్లలను దేశీయంగా, 431 మందిని విదేశీయులకు దత్తత కల్పించారు. గత అక్టోబరు నాటికి, మన దేశంలో 2,146 మంది పిల్లల దత్తతకు అనుమతి ఉంది. మరో 30 వేల మందికి పైగా దత్తత కోసం ఎదురు చూస్తున్నారు.

దేశవ్యాప్తంగా చూస్తే తెలంగాణ నుంచి దత్తత సంఖ్య ఎక్కువగా ఉంటోంది. గడిచిన రెండేళ్లలో దేశీయ దత్తతలో తెలంగాణ రాష్ట్రం ఏడవ స్థానంలో ఉంది. తొలి రెండు స్థానాల్లో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. అయితే విదేశీయులు తీసుకునే దత్తతలో రెండేళ్లుగా తెలంగాణ రెండవ స్థానంలో ఉంది. వివిధ రాష్ట్రాలు, విదేశాలకు చెందిన దంపతులు దత్తత తీసుకున్న చిన్నారుల యోగక్షేమాలను శిశు సంక్షేమ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటారు. హిందూ దత్తత చట్టం 1956 ప్రకారం హిందువులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు దత్తత తీసుకోవచ్చు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా దత్తత ప్రక్రియ పూర్తిచేసి, అనంతరం కోర్టు ద్వారా ఆమోదం పొందవచ్చు. ఇలాంటి దత్తతలో ప్రభుత్వ నిఘా ఉండదు. సాధారణంగా బంధువులు లేదా స్నేహితుల పిల్లలను ఈ పద్ధతిలో దత్తత తీసుకుంటారు.



జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, భద్రత) చట్టం 2015 దత్తతకు సంబంధించిన విషయాలను మరింత వివరంగా తెలియజేసింది. అన్ని మతాలకు వర్తించేలా రూపొందించిన ఈ చట్టం ప్రకారం కేంద్రం ఏర్పాటు చేసిన కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ (కారా) నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. తాజాగా సులభతరం చేసిన నిబంధనల ప్రకారం రాష్ట్రంలో తల్లిదండ్రుల్లేని, సంరక్షణ కొరవడిన ఆరేళ్లకు పైబడిన చిన్నారులను దత్తత ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలు సులభతరం చేసింది. ఆరేళ్ల వయసులోపు చిన్నారులు సంరక్షణ కేంద్రాలకు పరిమితమవుతారు. ఆరేళ్ల వయసు దాటిన చిన్నారులు సంరక్షణ కేంద్రాల నుంచి బయటకువచ్చి కుటుంబ వాతావరణంలో పెరిగేందుకు వీలుగా నూతన మార్గదర్శకాలు అందుబాటులోకి వచ్చాయి. రెండేళ్ల పాటు తాత్కాలిక సంరక్షణ కల్పించిన కుటుంబాలు, దంపతులు ముందుకు వస్తే వారికే పిల్లలను దత్తతకు ఇచ్చేలా 'ఆదర్శ ఫాస్టర్‌కేర్ నిబంధనలు 2024'ను రూపొందించింది. ఫాస్టర్‌కేర్ కోసం ముందుకు వచ్చే దంపతులు, కుటుంబాలు శారీరకంగా, మానసికంగా, భావోద్వేగపరంగా, ఆర్థికంగా, ఆరోగ్యపరంగా అర్హులై ఉండాలి. ఆరేళ్ల నుంచి పన్నెండేళ్లలోపు చిన్నారులను సంరక్షణలోకి తీసుకోవాలనుకున్న దంపతులిద్దరి వయసు కలిపితే 70 ఏళ్ల నుంచి 110 ఏళ్ల మధ్య ఉండాలి.

సింగిల్ పేరెంట్ అయితే 35 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి. 12 నుంచి 18 ఏళ్లలోపు చిన్నారులను దత్తత తీసుకోవాలనుకున్నా ఇవే వయో నిబంధనలు వర్తిస్తాయి. సింగిల్ పేరెంట్ పురుషుడు ఉన్నట్లయితే ఆడపిల్లను తాత్కాలిక సంరక్షణకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వరు. తాత్కాలిక సంరక్షణ సమయంలో పిల్లలపై వివక్ష చూపినా, సంరక్షణ సరిగా లేకున్నా ఆ దత్తతను రద్దు చేస్తారు. ప్రతి ఏటా సమీక్షించి సంతృప్తికరంగా ఉంటే 18 ఏళ్ల వరకు పొడిగిస్తారు. తాత్కాలిక సంరక్షణ పూర్తయిన తర్వాత శాశ్వత దత్తత కోరుకుంటే నిబంధనల ప్రకారం అనుమతినిస్తారు. సంతాన లేమి సమస్య కారణంగా దత్తతకు డిమాండ్ పెరుగుతోంది. చిన్నారులు తక్కువగా ఉండడం, దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో రెండేళ్ల నుంచి ఐదేళ్ల వరకు ఎదురు చూడాల్సి వస్తోంది. ఇక దత్తత తీసుకుంటున్న దంపతుల్లో ఎక్కువ శాతం మంది ఆడపిల్లలను కోరుకుంటున్నారు. మగపిల్లల కన్నా ఆడపిల్లలే ముద్దు అని, వారు ఉంటే ఇల్లంతా పండగే అని, చివరి క్షణాల్లో ప్రేమగా చూసుకునేది ఆడపిల్లలేనని విశ్వసిస్తున్నారు. అందుకే రాష్ట్రం నుంచి జరుగుతున్న దత్తత ప్రక్రియలో ఆడపిల్లల సంఖ్యనే ఎక్కువగా ఉంటోంది. నాలుగేళ్లలో 798 మంది చిన్నారులు మన దేశంతో పాటు విదేశాలకు దత్తతకు వెళ్తే, అందులో 527 మంది ఆడపిల్లలే. ఎక్కువ కాలం వేచి ఉండలేని కొంతమంది అక్రమ మార్గాల్లో 'దత్తత' పేరుతో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. కారా నిబంధనల మేరకు దత్తత పొందకుండా ఇతర మార్గాల్లో బిడ్డను దక్కించుకుంటే చిక్కులు తప్పవు. కొన్నేళ్లపాటు మమకారంతో పెంచుకున్న ఆ బిడ్డ వారికి కాకుండాపోతుంది. ఢిల్లీ, పుణెలతో పాటు పలు రాష్ట్రాల నుంచి చిన్న పిల్లలను తీసుకొచ్చి తెలుగు రాష్ట్రాల్లో అమ్మకాలు జరిపారు. ఇది తప్పా ఒప్పా అని ఆలోచించని ఎంతో మంది మధ్యతరగతికి చెందిన దంపతులు మమకారంతో బిడ్డలను కొనుగోలు చేశారు. కొందరైతే ఏళ్ల తరబడి సొంత బిడ్డకన్నా ఎక్కువగా పెంచుకుంటూ, వారిపైనే గంపెడు ఆశలు పెట్టుకున్నారు. స్టింగ్ ఆపరేషన్‌లో పిల్లల అక్రమ రవాణా గుట్టురట్టు కాగానే చట్టబద్ధంగా దత్తత పొందని పిల్లలను గుర్తించారు. ఆ బిడ్డలను అదుపులోకి తీసుకొని శిశుసంక్షేమ గృహాలకు తరలించిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. దత్తత ప్రక్రియలో సంక్లిష్టతలు ఉన్నప్పటికీ, వీటిని అధిగమించి నిబంధనల మేరకు పిల్లలను దత్తత తీసుకోవడం ఉత్తమమైన మార్గం. పిల్లలను అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరం. పిల్లలను కొనుగోలు చేసిన దంపతులపై కూడా సిఆర్‌పిసి, జువెనైల్ జస్టిస్ చట్టాల కింద కేసులు నమోదు చేస్తారు. పిల్లలను అంగట్లో సరుకుల్లా అమ్ముతున్న ముఠాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి.

# ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణను గెలిపించండి




### -గోపా జిల్లా అధ్యక్షులు అమరగాని నర్సయ్య గౌడ్

**అగ్నిధార న్యూస్ మంథని :** పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా గౌడ అఫీషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) అధ్యక్షుడు అమరగాని నర్సయ్య గౌడ్ కోరారు. శనివారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..డా. ప్రసన్న హరిక్రిష్ణ గౌడ్ అసిస్టెంటు ప్రొఫెసర్ గా వివిధ స్థాయిలో భోదన చేసిన అనుభవం ఉన్నటువంటి వ్యక్తి, నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగరంగాలలో స్థిరపడటానికి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయుటకు వారిని విజ్ఞాన వంతులను చేయుటకు వివిధ మార్గాలలో కృషి చేశారన్నారు. ఉచిత కోచింగ్ సెంటర్ల ద్వారా విద్యాభోధనతో పాటు, ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ చేశారని, స్వయంగా పరిశోధనాత్మకమైనటువంటి పుస్తకాలను రచించి ప్రచురించినారని, పేద విద్యార్థినులను గుర్తించి వారికి విద్యాపరంగా ఆర్థిక సహాయం చేసారని. కరోన సమయంలో కరీంనగర్ మండలం కాట్నపల్లి గ్రామంలో తల్లి, తండ్రులను కోల్పోయి . అనాథలైన ఇద్దరు బాలికలకు తన వంతుగా సహాయంగా సన్నిహిత మిత్రుల ద్వారా విరాళాలు సేకరించి రూ. 3 లక్షల పై చిలుకు ఆర్థిక సహాయం అందించినారని బడుగు బలహీన వర్గాల నుండి మేధావిగా ఎదిగినటువంటి బీసీ గౌడ ముద్దుబిడ్డ డా. ప్రసన్న హరిక్రిష్ణ గౌడ్ కు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల, నిరుద్యోగుల, పట్టభద్రుల సమస్యల పట్ల అవగాహన కలిగి ఉన్నాడని, డా. పులి ప్రస్నన్న హరిక్రిష్ణ ఆశయాలను సిద్ధాంతాలు, సేవగుణములను లన్నింటిని పరిగణలోనికి తీసుకుని చట్ట సభలలో మాట్లాడే విషయ పరిజ్ఞానం, భాషపై పట్టు కలిగి ధైర్యమున్న వ్యక్తిగా ఆయనను అభివర్ణించారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు ఈ విలేకరుల సమావేశంలో గోపా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోశాధికారి పరకాల మురళి గౌడ్, కార్యదర్శులు దూలం అంజయ్య గౌడ్, బుర్ర జగదీశ్వర్ గౌడ్, పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కుక్కీస దేవేంద్ర గౌడ్ లు పాల్గొన్నారు.

# కృష్ణవేణి విద్యార్థులను అభినందించిన ఐటీ మంత్రి శ్రీధర్ బాబు



**అగ్నిధార న్యూస్ మంథని :** కృష్ణవేణి హై స్కూల్ విద్యార్థులు ఎండి సిరాజ్ హుస్సేన్, శక్తి స్వరూప్ సాత్విక్ లను శనివారం మంథని పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ ఐటి పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అభినందించారు. 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ అండర్ 17 విభాగంలో కృష్ణవేణి హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్న సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు అభినందించి, జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్, కృష్ణవేణి హై స్కూల్ ప్రిన్సిపాల్ జాఫర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బీరం లక్ష్మా రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రులు



**వనపర్తి: (ఫిబ్రవరి 23 అగ్ని ధార న్యూస్ ) :** కొల్లాపూర్ మాజీశాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి లక్ష్మా రెడ్డిగత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలోచికిత్సఅనంతరం వారి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు ఈ విషయం తెలుసుకొన్న మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిలక్ష్మా రెడ్డి ని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితినిఅడిగితెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారితో పాటు బీఆర్ ఎస్ రాష్ట నాయకులు అభిలాష్ రావు మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డిపెంట్లవెల్లి మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు రాజేష్,సురేందర్ గౌడ్ఉన్నారు.

# తక్కువ పెట్టుబడితో అధిక రాబడి





### ప్రతి జిల్లాకు ఒక పామాయిల్ కంపెనీ స్థాపించడం ప్రభుత్వ లక్ష్యం.

### సాగుకు ప్రభుత్వం ఎకరాకు రూ.51 వేల సబ్సిడీ

అగ్నిధారన్యూస్,వనపర్తి: ఫిబ్రవరి 22 : దేశంలో ఉన్న మంచి నూనె కొరతను అధిగమించి ఇతర దేశాలకు ఎగుమతి చేసేస్తాయికి ఎదిగేందుకు అత్యధికంగా పామాయిల్ సాగుని పెంచాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.శనివారం రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి వనపర్తి జిల్లాలో పర్యటించారు..వనపర్తికి చేరుకున్న మంత్రి. తుమ్మల నాగేశ్వర్ రావు ముందు పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఉప వైద్య కేంద్ర భవనం, మోజర్ల గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 8.38 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన వ్యవసాయ గోదాముల సముదాయానికి శంఖుస్థాపన చేశారు.అదేవిధంగా పెబ్బరులో రూ. 5.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న మరో వ్యవసాయ గోదాము 5000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగినది, రూ. 44 లక్షల వ్యయంతో వ్యవసాయ కార్యాలయ అదనపు భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.రూ. 3.00 కోట్లతో పెబ్బేరులో ఇంతకుముందు కాలిపోయిన మార్కెట్ యార్డు గోదాము పునర్నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.అనంతరం గోపాల్ పేట మండలం బుద్దారం గండి ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామిని దర్శనం చేసుకున్నారు.అక్కడే గోపాల్ పేట మండలం పోల్కేపాడ్ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ యార్డు, ఘనపూర్ మార్కెట్ యార్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.అనంతరం దేవరకద్ర నియోజకవర్గంలోని సంకిరెడ్డి పల్లి గ్రామంలో ప్రీయునిక్ సంస్థ ద్వారా నిర్మించనున్న పాయిల్ ఫ్యాక్టరీకి ఆయన భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా పామాయిల్ రైతులతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వ్యవసాయ శాఖ మంత్రి. తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ భారత దేశంలో ప్రజలకు అవసరమైన మేరకు వంట నూనె ఉత్పత్తి లేకపోవడం వల్ల ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని తద్వారా మన ఫారెన్ నిల్వలు ఇతర దేశాలకు చెల్లించడం జరుగుతుందన్నారు.దేశంలో వంట నూనెల లోటు భర్తీ చేయాలంటే 70 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు.తక్కువ పెట్టుబడి తో అత్యధిక లాభం పొందే పంట పామాయిల్ పంట మాత్రమే అని అన్నారు.పామాయిల్ సాగుకు ప్రభుత్వం ద్వారా ఎకరాకు 51 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు.మొక్కల పంపిణితో మొదలుకొని డ్రిప్, 4 సంవత్సరాల వరకు అంతర్ పంట సబ్సిడీ కింది ఎకరాకు 4200 రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు.

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నా రెడ్డి ...పామాయిల్ సాగు వల్ల సంవత్సరానికి ఎకరాకు 1.5 లక్షల ఆదాయం వస్తుందని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నా రెడ్డి తెలియజేశారు.వనపర్తి జిల్లా ప్రజలు ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్న పామాయిల్ కంపెనీ ఎట్టకేలకు భూమి పూజ చేసుకోవడం జరిగిందని, త్వరలోనే నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రీయునిక్ సంస్థను కోరారు. జిల్లాలో ఇది వరకే సాగు చేసిన పంటకు గెలలు కోతకు వస్తున్నాయని, వాటిని కోసిన 24 గంటల్లో అయిల్ గా మార్చాల్సి ఉంటుందని లేనియెడల అది పనికిరాకుండా పోతుందన్నారు.

ఎంపీ.మల్లు రవి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డ అని, బడుగు బలహీన వర్గాలు, రైతుల సమస్యలు తన సమస్యలుగా భావించి పరిష్కరిస్తున్నారని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి అన్నారు.ఇంటింటి సర్వే, కులగణన విజయవంతంగా పూర్తి చేసి ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు అన్నారు.

దేవర కద్ర శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ .... దేవరకద్ర నియోజకవర్గంలో మరో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం ను మంజూరు చేయాలని స్థానిక శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి మంత్రి. తుమ్మల నాగేశ్వర్ రావుని కోరారు.సంకిరెడ్డి పల్లిలో పామాయిల్ కంపెనీ ఏర్పాటు వల్ల పర్యావరణ హానికర వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.సహకార సంఘాల అధ్యక్షులు పదవీకాలం మరో 6 నెలలు పొడిగించినందున ధన్యవాదాలు తెలిపారు.

వనపర్తి ఎమ్మెల్యే. మేఘా రెడ్డిబి.... బివనపర్తి జిల్లాలో 1680 మంది రైతులు 5500 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారని, త్వరలో 10 వేల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు.ఉద్యానవన శాఖలో సిబ్బంది కొరత ఉందని వాటిని భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.మూడు వంతెనల నిర్మాణానికి అనుమతులు తీసుకున్నామని, జిల్లాలో వేరు సెనగ సాగు ఎక్కువగా ఉన్నందున, పెద్ద మందడి మండలంలో వేరు శెనగ పరిశోధన కేంద్రం మంజూరు చేయాల్సిందిగా మంత్రిని కోరారు.వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యాన వన శాఖ మేనేజింగ్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, డి.సి.సి.బి చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సైతం మాట్లాడారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ జి .వెంకటేశ్వర్లు,ఆర్డీఓ సుబ్రమణ్యం , వనపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, దేవరకద్ర మార్కెట్ యార్డు చైర్మన్ ప్రశాంత్, పి.ఏ.సి.ఎస్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు .

# పలుపేద కుటుంబాలకు బియ్యం అందజేత



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** స్థానిక కమాన్పూర్ గ్రామ పంచాయతి గోకుల్ నగర్ పరిధిలో గోపు రాజయ్య, ఇటీవల మరణించిన విషయం తెల్సిన సుందరం ఫౌండేషన్ ఫౌండర్, బోనాల వెంకటస్వామి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి 25 కిలోల బియ్యంతో పాటు .2000/- రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే అదే గోకుల్ నగర్ కు చెందిన దుర్కి లక్ష్మి మల్లు నరిగే పెద్ద మల్లయ్య, అనారోగ్యం కారణంగా ఇటీవల మరణించగా ఒక్కొక్కరి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి 25కిలోల బియ్యం అందజేసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.మా ఫౌండేషన్ ద్వారా ప్రతీ పేద భాధితుడికి సాయం అందించాలనే లక్ష్యం తోనే మా సంస్థ పనిచేస్తుందని అలాగే నిస్వార్థంగా పేద వారికి సాయం అందించడమే మా ఫౌండేషన్ సభ్యుల లక్ష్యమని ఈసందర్బంగా బోనాల వెంకటస్వామి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కన్నూరి నగేష్, చిప్పకుర్తి అరవింద్, చెన్నోజు చంద్రశేఖర్, దండే తిరుపతి, గుంజపడుగు నవీన్, కుక్క వర ప్రసాద్, కామ సంతోష్ లతో పాటు గోకుల్ నగర్ కి చెందిన కుల పెద్దలు ఐన నరిగే మల్లేష్, కోరే బీరయ్య, కొమ్ము షేరాలు, తూండ్ల రాజన్న, కొమ్ము మల్లేష్, గోపు పర్వతాలు మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీఎన్నికల ప్రచారం..

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**అగ్నిదారన్యూస్ :ఎండపల్లి :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని రాజారామ్ పల్లి గ్రామంలో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్ ఎల్ సి ఎన్నికల ప్రచారంలో శనివారం రోజున ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎండపెల్లి మండలంలోని రాజారాంపల్లె గ్రామంలో అక్షరా హైస్కూల్ ను సందర్శించి ఉపాధ్యాయులను కలిసి కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్ ఎల్ సి అభ్యర్థి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా: వి.నరేందర్ రెడ్డి సీరియల్ నెంబర్ 2 పైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక డంపుల సీజ్.....



అగ్నిధారన్యూస్, భీమారం మండలం, ఫిబ్రవరి 22: జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండల పరిధిలోని వరద కాలువ వెంబడి శనివారం రోజున తనిఖీలు చేస్తూ ఉండగా మన్నెగూడెం శివారులోని వరద కాలువ ప్రక్కన సుమారు 40- 45 ట్రిప్పుల ఇసక నిల్వలను గుర్తించడం జరిగింది. అక్కడ ఇసుక నిల్వ ఎవరు చేశారో తెలియడం లేదని ఎంక్వయిరీ చేస్తున్నామని అంతవరకు ఇసుకను చీజ్ చేయడం జరిగిందని మైనింగ్ ఏడి జయసింగ్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలుపడం జరిగింది. ఏడి వెంట కథలాపూర్ ఆర్ఐ నాగేష్, భీమారం ఆర్ఐ రాజారాం తదితర అధికారులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు

### విద్యార్థులందరు సకాలంలో పరీక్షకు హాజరు కావాలి

### ప్రిన్సిపాల్ దత్తరాణి



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)":** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలో అల్లాపూర్ బాలికల గురుకుల పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశానికై ఈనెల. 23న స్థానిక గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ . దత్తరాణి తెలిపారు.467 మంది విద్యార్థులు పరీక్షా కేంద్రానికి కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు.ఉదయం11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని గంట ముందుగా విద్యార్థులను పరీక్షా కేంద్రాలోనికి అనుమతిస్తామన్నారు. విద్యార్థులు బాల్ పాయింట్ పెన్ను, హాల్ టికెట్, పరిక్ష పాడ్ లను తప్పనిసంగా తీసుకొని పరీక్షకు హాజరుకావాలని ఓ. ఎమ్. ఆర్ పద్దతిలో ప్రవేశ పరిక్ష ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిక్షలు రాసేందుకు డెస్క్ బెంచీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి మండలం అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులు గా మారి స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గా స్వామి జిల్లా విద్యాధికారిగా హర్ష మండల విద్యాధికారిగా మీనాక్షి, ప్రధానోపాధ్యాయులు గా అరుణ్, టీచర్లుగా తులసి రాహుల్,రాం చరణ్ ,జనని గోపిక,శ్రీనిధి,రోజర్, పి ఇ టీ లు గా మనోహర్ మణికంఠలు విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు గా బోధనలో మెళుకువల గురించి క్రమశిక్షణ గురించి తెలుసుకున్నమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి ప్రతాపరెడ్డి ఉపాధ్యాయినీలు శ్రీదేవి ఖ్యాతి సుదన్ లు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# అంగన్వాడి సెంటర్... మూడున్నరకే మూత...




## పట్టించుకోనిపై అధికారులు తీరుతో గ్రామస్తులకు తప్పని తిప్పలు

**అగ్నిధార న్యూస్మహమ్మదాబాద్ :** మండల పరిధిలోని మహమ్మదాబాద్, నంచర్ల సెక్టార్ల పరిధిలో అంగన్వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ గాడి తప్పింది. పర్యవేక్షణ లోపం కారణంగా అంగన్వాడీ టీచర్లు వారి ఇష్టానుసారంగా కేంద్రాలను నిర్ణీత సమయాని కంటే ముందే మూసి వెళ్లిపోతున్నారు. శనివారం నంచర్ల పేటలో గల అంగన్వాడి కేంద్రం మధ్యాహ్నం 3:30నింలకు మూసి వెళ్లిపోయారు. నాలుగు రోజుల క్రితం సూపర్వైజర్ గృహప్రవేశానికి కొందరు టీచర్లు అనుమతి లేకుండా మధ్యాహ్నామే వెళ్లడంతో వివరణ కోరుతూ నోటీసులు అందించినప్పటికీ అంగన్వాడి టీచర్లలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఉన్నతాధికారులు సైతం చూసి చూడనట్లు వదిలేయడంతో ఇష్టానుసారం విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఉదయం ఆలస్యంగా అంగన్వాడి పాఠశాలను తెరవడం, మధ్యాహ్నం నిర్ణీత సమయానికి ముందే మూసి వెళ్లడం పరిపాటిగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

# యూపీఎస్ పై యుద్ధభేరి



## జిల్లా ప్రధాన కార్యదర్శి కె.యం.చంద్రకాంత్

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ :** జెడ్పిహెచ్ఎస్ బాలుర బాలికల మహమ్మదాబాద్ యుపిఎస్ మొక్కల రాబాద్ యుపిఎస్ గాదిర్యాల్ జెడ్పిహెచ్ఎస్ నంచర్ల లలో యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా టి ఎస్ సి పి ఎస్ ఈ యు జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎం చంద్రకాంత్ మాట్లాడుతూ... సిపిఎస్ విధానంకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రెండు లక్షల 50 వేల మంది ఉద్యోగు ఉపాధ్యాయులు రాష్ట్రవ్యాప్తంగా గత దశాబ్ద కాలంగా పోరాటం చేస్తుంటే ప్రస్తుతం యుపిఎస్ పేరుతో ఉద్యోగులను మభ్య పెట్టేందుకు కేంద్రం ప్రయత్నం చేస్తుందని ఏప్రిల్ ఒకటి నుండి కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న యుపిఎస్ విధానం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయుల జీవితాలు మరింత దుర్భరం అవుతాయని ఈ యుపిఎస్ విధానం వల్ల కార్పొరేట్ శక్తులకు ఉద్యోగుల జీవితాలను తాకట్టు పెట్టడమే అవుతుందని, ఉద్యోగులకు ఏ విధంగా కూడా భద్రత కల్పించని ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకొని 1980 పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈరోజు కేంద్ర ప్రభుత్వం సిపిఎస్ నుంచి యుపిఎస్ లోకి వెళ్లే కొత్త పాలసీని తయారు చేయడం దౌర్భాగ్యం అని తెలిపారు దేశంలోని జార?ండ్ రాజస్థాన్ ఛత్తీస్గడ్ హిమాచల్ ప్రదేశ్ పంజాబ్ లలో సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ ను పునరుద్ధరించిన మాదిరిగా మన రాష్ట్రంలో కూడా వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గడ్డం వెంకటేష్ స్టేట్ ఐటీ సెల్ కన్వీనర్ టి ఎస్ సి పి ఎస్ ఈ యు మండల అధ్యక్షులు విజయ్ కోశాధికారి గోపాల్ నాయక్ జిల్లా బాధ్యులు ఖాదర్ కురుమయ్య పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి అన్నపూర్ణ గీత బాలరాజ్ లాలయ్య నర్సింలు పాల్గొన్నారు

# ఆరోగ్యానికి దివ్యౌషధం తెల్లకల్లు



- ప్రకృతిసిద్దంగా లభించే కల్లునే సేవించాలి.
- కులవృత్తులను ప్రోత్సహించాలన్నదే లక్ష్యం.
- ఇంగ్లీస్ మందులు ఆరోగ్యానికి హనికరమే.

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** తెలంగాణలో సురాపానకంగా బావించే తెల్లకల్లు ఆరోగ్యానికి దివ్య ఔషధంగా పని చేస్తుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తెలిపారు. శనివారం ఉదయం మహాముత్తారం మండలం సింగారం గ్రామంలోని తాటివనంలో ఆయన తాటికల్లు సేవించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సిద్దంగా లభించే తెల్లకల్లును ప్రతి ఒక్కరు సేవించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. తెల్లకల్లును డాక్టర్లు, శాస్త్రవేత్తలు సైతం చెబుతుంటారని, అనేక వ్యాధులకు ఔషధంగా పనిచేస్తుందని ఆయన వివరించారు. ప్రతి రోజు గౌడలు ఉదయం, సాయంత్రం తాటి చెట్లు ఎక్కి తాటి కల్లు తీసి మన ఆరోగ్యం కోసం కష్టపడుతుంటారని ఆయన కొనియాడారు. కులవృత్తులను ప్రోత్సహించాలన్నదే తన లక్ష్యమని, గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సైతం తెల్లకల్లు సేవించి కల్లు ప్రత్యేకతను చాటానని, ఈనాడు మళ్లీ మంథని కేంద్రానికి 75కిలో మీటర్ల దూరంలో ఉన్న సింగారం వచ్చి ఇక్కడి నుంచి కల్లు విశిష్టతను చెప్పడం జరుగుతుందన్నారు. ఇంగ్లీష్ మందులైన రమ్ము, బ్రాండీ, విస్కీ, బీర్లాంటివి సేవిస్తే ఆరోగ్యం చెడిపోతుందని, ఆ బాటిల్స్‌పైనే ఆరోగ్యానికి హనికరం అని రాసి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. సింగారం గ్రామంలో ఆరువై పాల్లు ఉన్నాయంటే ఇక్కడ ఎక్కువ శాతం గౌడలు ఉంటారన్నారు.ప్రకృతి సిద్దంగా లభించే తెల్లకల్లును ప్రతి ఒక్కరు సేవించి సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

# .నర్సరీ కార్మికులకు కనీస వేతనాల అమలు కోసం ఉత్తర్వులు జారీ చేసిన యాజమాన్యం.

## ఏఐటియుసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ వెల్లడి

**అగ్ని ధార న్యూస్,( రామగుండం ):** సింగరేణి వ్యాప్తంగా నర్సరీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల అమలు కోసం సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 2022 లో చేసిన 18 రోజుల సమ్మె సందర్భంగా యూనియన్ లు యాజమాన్యం తో చేసుకున్న ఒప్పందంలో భాగంగా అట్టి ఒప్పందం లోని డిమాండ్ లను అమలు చేయాలని గుర్తింపు సంఘం ఏఐటియుసి కోరిన మేరకు యాజమాన్యం నర్సరీ లలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్ట బద్ధమైన హక్కులను అమలు చేసేందుకు తగు ఆదేశాలు జారీ చేసిందని ఆయన వెల్లడించారు. గుర్తింపు సంఘం ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు కృషి ఫలితంగా సింగరేణి వ్యాప్తంగా నర్సరీ కార్మికులకు మార్చి 1వ తేదీ నుండి కనీస వేతనాల అమలు,సీఎం పిఎఫ్, బోనస్సు,బ్యాంకు జీతాలు తదితర హక్కుల ను అమలు చేస్తారని ఆయన పేర్కొన్నారు. కనుక నర్సరీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఏఐటియుసి కృషి ని గమనించగలరని ఆయన ఒక ప్రకటన లో పేర్కొన్నారు.

# గంజాయి పట్టివేత



## విలువ రూ. 7,95,200/- గా వెల్లడి.

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** హైదరాబాద్ లోని శామీర్ పేటకు చెందిన ఓ వ్యక్తి వైజాగ్ నుండి రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గంజాయి విక్రయించేందుకు వస్తున్నాడనే రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ గోదావరిఖని ఏసీపీ రమేశ్ కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు వారి ఆదేశాల మేరకు రామగుండం ఎస్ఐ సంధ్య రాణి సిబ్బంది తో కలిసి రైల్వే స్టేషన్ ప్రాంతం లో పెట్రోలింగ్ చేసే క్రమంలో రామగుండం రైల్వేస్టేషన్ లో పోలీసులను చూసి అనుమానస్పదంగా ఒక వ్యక్తి లగేజీ బ్యాగులతో నడుచుకుంటూ వేగంగా వెళుతుండడంతో అనుమానం వచ్చి బ్యాగులను సోదా చేయడంతో అందులో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించడం జరిగింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి విచారించగా తను శామీర్ పేట మండల పరిధిలోని అతిరాజ్ పల్లి గ్రామానికి చెందిన తీగుళ్ల రామకృష్ణ అని రెండు లగేజీ బ్యాగులలో గంజాయి తో ఎవరికీ అనుమానం రాకుండా వైజాగ్ నుండి ఏపీ ఎక్స్ ప్రెస్ రైలులో దిగాను అని తెలపడం జరిగింది. రెండు బ్యాగులలో 15.904 కేజీల గంజాయి, దాని విలువ రూ. 7,95,200/-గా గుర్తించడం జరిగింది. ఎస్ ఐ రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ కి సమాచారం అందించి గంజాయిని సీజ్ చేసి తీగుళ్ల రామకృష్ణపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది. కాగా గంజాయి రవాణా, విక్రయాలతో పాటు ఎంతమంది సరఫరా చేస్తున్నారనే విషయాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ టాస్క్ లో పోలీసు సిబ్బంది సంపత్, నరేష్, బాణయ్యలను సీపీ, ఏసీపీ,సీఐ,లు అభినందించారని ఎస్సై సంధ్యారాణి తెలిపారు.

# మెగా వైద్య శిబిరం



## ప్రజల నుంచి అనూహ్య స్పందన. 66 మందికి రక్తదానం. 526 మందికి వైద్య పరీక్షలు.

**అగ్నిదారన్యూస్ :ఎండపల్లి :** కరీంనగర్ జిల్లా కేంద్రంలో టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ బ్రాంచిలో శనివారం రోజు మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు , సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సూర రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు నుండీ అనూహ్య స్పందన లభించింది. వైద్య సేవలు పొందేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.ఈ వైద్య శిబిరంలో న్యూరో, డెంటల్, ఐ కేర్ కన్సల్టేషన్లు ఉచితంగా అందించడంతో పాటు బ్లడ్ డొనేషన్ కార్యక్రమం కూడా చేపట్టారు. మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిపుణులైన వైద్యులు ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు ఈ వైద్య శిబిరంలో 145 మందికి డెంటల్, 175 మందికి కంటి, 152 మందికి న్యూరో-ఫిజికల్ పరీక్షలు నిర్వహించారు. మెగా బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో 66 మంది పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 526 మంది పరీక్షలు చేయించుకోగా, అవసరమైనవారికి మందులను ఉచితంగా అందించారు.ఈ సందర్భంగా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సూర రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం తమ బాధ్యత అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు టాటా ఏఐఏ నిత్యం ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తుందన్నారు. రతన్ టాటా స్ఫూర్తితో దాతృత్వ సేవలను కొనసాగిస్తున్నామని అందులో భాగంగానే ఈ మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గతంలో అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించామని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అన్నదానం, అనాథ పిల్లలు, వృద్ధాశ్రమాల్లో అన్నదానం, దుప్పట్ల పంపిణీ వంటి కార్యక్రమాలను చేపట్టినట్టు గుర్తు చేశారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ తమకు ఎంతో ఉత్సాహాన్ని, సంతృప్తిని ఇస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సేవా, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.అలాగే ప్రతి కుటుంబానికి జీవిత బీమా ద్వారా ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, టాటా జీవిత బీమా పాలసీలు అన్ని వర్గాల ప్రజల కుటుంబ అవసరాలకు సరిపోయేలా రూపొందించబడ్డాయన్నారు. టాటా సంస్థలు పారదర్శకత, నాణ్యతకు పెట్టింది పేరుగా ఉంటాయి. ఆ నమ్మకాన్ని కొనసాగిస్తున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో (వీరస్వామి ఆదర్శ్ చంద్రశేఖర్ వెంకటేష్ వర్మ మహేందర్ శ్రీకాంత్ జి రాజు సృజన్ డి రమేష్) పాల్గొన్నారు. (తాటికొండ అనిల్ కుమార్ శ్రీధన్వి మల్టీ స్పెషాలిటీ న్యూరో హాస్పిటల్ శ్రీ వైష్ణవి ఎస్సార్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ వాసన్ ఐ కేర్ సివిల్ హాస్పిటల్ )వైద్య సేవలు అందించగా ఈ కార్యక్రమంలో ఇన్సూరెన్స్ అడ్వైజర్లు పాల్గొన్నారు,

# బీసీల జోలికి వస్తే ఊరుకునేది లేదు

**అగ్నిధారన్యూస్ మందమర్రి మండలం ఫిబ్రవరి 22, :** మందమర్రి స్థానిక ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో..పట్టణ అధ్యక్షుడు సకినాలశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల వెంకటేష్,అధ్యక్షులు పోల్ శ్రీనివాస్, మందమర్రి పట్టణ యువజన అధ్యక్షుడు మూడారపు శేఖర్,లు మాట్లాడుతూ...గత వారం రోజుల క్రిందట బీసీలపై మాల సంఘం పైడిమల్ల నర్సింగ్, బీసీలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. బీసీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి అని వారు కోరారు. రాబోయే రోజుల్లో క్షమాపణ చెప్పనట్లఐ తే,తీవ్ర పరిణామాలు ఉంటాయని,వాటికి పూర్తి బాధ్యత పైడిమల్ల నర్సింగ్ పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. అసలు ఏ పార్టీలో ఉండి ఏం మాట్లాడుతున్నాడో.. తెలియకుండా ఉంది. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు కుల ఘననకు అనుకూలంగా మాట్లాడిన ముఖ్యమంత్రిని కాదని, బీసీల మధ్య చిచ్చుపెట్టే విధంగా.. ఇలాంటి వాక్యాలు చేయడం సిగ్గుచేటు. అన్నారు అసలు మాల సంఘంలో ఎవరికి ఏం పోస్టు ఉందో కూడా తెలియకుండా, ఆ సంఘ%శీ% సభ్యుల కు అర్థం కాకుండా ఉంది అన్నారు. ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంఘాలన్నీ కలుపుకొని, ముందుకు వెళ్లాల్సిన సమయంలో.. ఇలాంటి వాక్యాలు చేయడం సరైనది కాదన్నారు. బే షరతుగా క్షమాపణ చెప్పి తీరాలని వారి కోరారు. ఈ కార్యక్రమంలో.. రామస్వామి శేఖర్, బేరా వేణుగోపాలరావు, దేవరపల్లి ప్రభాకర్, పోల్ సంపత్, మునిసెట్టి సత్యనారాయణ, మాడకుండా శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ చాలీసా పారాయణం

## మాణిక్ ప్రభు వీధి హనుమాన్ మందిరంలో సత్సంగ్.



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)":** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మాణిక్ ప్రభు వీధి హనుమాన్ మందిరంలో సత్సంగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగినది శివశక్తి మండల అధ్యక్షులు ఎం పల్లి సంగమేశ్వర అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించడం జరిగినది ముందుగా ఓంకారం గౌరీ గణపతి సరస్వతి గాయత్రి మహా మృత్యుంజయ మంత్రాల ఉచ్చరణతోపాటు హనుమాన్ చాలీసా పారాయణం లింగాష్టకం ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రం అష్టాదశ పీఠ స్తోత్రం శ్రీరామ మంత్రం హనుమాన్ మంత్రాలతో పాటు విశిష్ట అతిథులుగా వచ్చినటువంటి విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సత్సంగ్ ప్రముఖ రామ్ రెడ్డి మోక్షం కొరకు నిరంతరం కృషి చేయాలని చెప్పారు. మహేశ్వర్ తెలుగు పండిత్ భక్తి భావం ఎలా పెంపొందించుకోవాలో వాటి గురించి చెప్పడం జరిగినది. కార్యక్రమానికి జిల్లా శివశక్తి అధ్యక్షులు ఎంపీ శ్యామ్ రావు మాట్లాడుతూ.. ప్రేమతో భక్తితో దేవుని ఆరాధించినట్లయితే ముక్తి లభిస్తుందని చెప్పడం జరిగినది కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బిచ్చప్ప, అంబన్న, వెంకటేష్, సంగమేశ్వర్, కాలనీ మహిళలు, పిల్లలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వేలాల జాతర ఏర్పాట్లను పరిశీలించిన సీపీ



**అగ్నిధార న్యూస్,( రామగుండం):** మంచిర్యాల జోన్ జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26 నుండి 28 వరకు జరిగే వేలాల జాతర కు సంబంధించిన ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఐపిఎస్., పోలీస్ అధికారులతో కలిసి వేలాల గుట్టపైన మరియు వేలాల గ్రామంలో గల టెంపుల్, తదితర ప్రాంతాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ..... ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ఏలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా రోడ్డు మరమ్మతులు చేయించాలని, జాతర సమయం లో ట్రాఫిక్ సమస్య రాకుండా జాతరకు వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవుడి దర్శనం చేసుకుని వారు క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని వేలాల గుట్టపైన మరియు వేలాల గ్రామంలో గల టెంపుల్ ను మరియు గోదావరి లో బాతింగ్ ప్రదేశాలను మరియు పార్కింగ్ ప్రదేశాలను సందర్శించి పోలీస్ అధికారులకు డీసీపీ సూచించడం జరిగింది.డిసీపీ గ వెంట జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది సమస్యల పరిష్కారంకే "పోలీస్ దర్బార్"




**అగ్నిధార న్యూస్,( రామగుండం):** రామగుండం కమిషనరేట్ స్పెషల్ పార్టీ, క్యూఆర్టి సిబ్బంది, అధికారులకు రామగుండం కమిషనర్ ఆఫ్ పోలిస్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఆదేశాల మేరకు కమీషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో "దర్బార్" కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమం కు సీపీ హాజరై స్పెషల్ పార్టీ, యు ఆర్ టి సిబ్బంది తో మాట్లాడి సమస్యలను, వినతిలను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అడిగిన వినతిలను, సమస్యలను వెంటనె పరిష్కరించే విధముగా చూస్తాం అన్నారు. ఏలాంటి సమస్య ఉన్న దర్బార్ లో చెప్పడం ఇబ్బందిగా ఉంటే ఆఫీస్ కి వచ్చి నేరుగా కలిసి చెప్పవచ్చు అన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.....స్పెషల్ పార్టీ, క్యూఆర్టి పోలీస్ విధి నిర్వహణలో భాగంగా ఎన్నో పని ఒత్తిళ్లను ఎదుర్కోనాల్సి వుంటుంది క్రమ శిక్షణ, ప్రణాళికబద్దంగా విధులు నిర్వహించడంతో ద్వారా ఈ ఒత్తిళ్లను అధిగమించవచ్చని కాని వ్యక్తిగత కారణాలతో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లు చాలా ప్రమాదకరమని కొన్ని సందర్బాల్లో ఈ ఒత్తిళ్ల కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోనాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో ఒత్తిళ్లు తట్టుకోలేక క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబ రోడ్డున పడుతుందని ముఖ్యంగా క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకునే ముందు మీ కుటుంబ గురించి ఆలోచించాలని సూచించారు. సిబ్బంది క్రమశిక్షణతో డ్యూటీ లను నిర్వర్తించాలని రామగుండం కమిషనరేట్ కి, తెలంగాణ పోలిస్ మంచిపేరు తీసుకురావాలన్నారు. బయట డ్యూటీస్ కి వెళ్ళినప్పుడు ఇబ్బందుల ఉంటె సంబందిత అదికారులకు తెలియచేయాలన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో, మంచిప్రవర్తన తో విదులు నిర్వర్తించినప్పుడు అదికారులు తమ వెంట ఉంటామన్నారు. సిబ్బందికి చేయవలసిన విధులు, చేయకూడని పనుల గురించి పలు సూచనలు, ఆదేశాలు చేయడం జరిగింది. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటు పడి, విధులలో నిర్లక్ష్యం వహించినట్లైతే, పోలీస్ శాఖ ప్రతిష్ట కి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన శాఖ పరమైన చర్య తీసుకొవడం జరుగుతుందన్నారు . ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ. రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ లు దామోదర్, శ్రీనివాస్, ఆర్ ఎస్ఐ లు, సిబ్బంది పాల్గోన్నారు.

## ప్రశ్నించే గొంతుకలని పెద్దల సభకి పంపించండి



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని :** గ్రాడ్యువేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్కా కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డిగార్లకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, శనివారం రోజున మహర్షి డిగ్రీ కాలేజ్ ఉపాధ్యాయులను కోరిన కందుల సంధ్యారాణి ఈసందర్భంగామాట్లాడుతూ... గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ సంఘాల హక్కుల కోసం పోరాడే శక్తి బీజేపీ అభ్యర్థులదే అన్నారు. విద్యావ్యవస్థలో సంస్కరణలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, యువత భవిష్యత్తుకు బలమైన విధానం రూపొందించడంలో మల్కా కొమురయ్య మరియు చిన్నమైల్ అంజిరెడ్డి లకు పూర్తి అనుభవం ఉంది అని,కాబట్టి, మా బీజేపీ అభ్యర్థులను గెలిపించి, న్యాయమైన హక్కులను సాధించుకునే దిశగా ముందుకు సాగాలని ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ ఓటర్లు మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మెరుగు హనుమంతు గౌడ్, రామగుండం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇన్చార్జి గుండెబోయిన భూమయ్య ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇంచార్జ్ మచ్చ విశ్వాస్, లక్ష్మీ నగర్ మండల అధ్యక్షులు కోడూరు రమేష్ , జక్కుల పద్మ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణానికి నిధులు కేటాయించండి

**సింగరేణిలో భూములు కోల్పోయిన బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించండి**

**యువత మద్యం - మత్తు పానీయాలకు అలవాటు పడి చెడిపోతున్నారు.**

**సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్**



**అగ్నిధార న్యూస్,(రామగుండం):** పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన (లైబ్రరీ) నిర్మాణానికి రెండు కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి పెద్దపల్లి జిల్లా పర్యటనలో భాగంగా ఎన్టీపీసీ మాతంగి కాలనీకి వచ్చిన ఎంపీ వంశీకృష్ణను శుక్రవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామగుండం రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలో డాక్టర్ అంబేద్కర్ భవన నిర్మాణం కోసం గతంలో స్థలం కేటాయించడం జరిగిందని, అందులో తమరి హయంలో భవనం(లైబ్రరీ) నిర్మించాలని అన్నారు. తాము డాక్టర్ అంబేద్కర్ స్థాపించిన సమతా సైనిక్ దళ్ సంస్థలో పనిచేస్తూ, వారి ఆశయాలకు అనుగుణంగా వారి స్ఫూర్తితో పే బ్యాక్ టు ద సొసైటీ నినాదంతో సమతా ఫౌండేషన్ ను స్థాపించి, నిరు పేదలకు విద్యా, వైద్యం, ఉపాధి మొదలైన సదుపాయాలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఐదవ షెడ్యూల్ (ఉమ్మడి అదిలాబాద్, వరంగల్, ఖమ్మం మహబూబ్నగర్) జిల్లాల ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు 12 లక్షల మంది దళితులకు పుట్టిన భూమిపై హక్కులు లేక, రాజకీయ రిజర్వేషన్ లేక, చదువుకున్న ఉద్యోగాలు రాక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును తరాలుగా నివసిస్తున్న వారికి వర్తించే విధంగా పార్లమెంట్లో మాట్లాడాలని కోరారు. ముఖ్యంగా యువత మద్యం- మత్తు పానీయాలకు అలవాటు పడుతూ చెడిపోతున్నారని అన్నారు. వారిని మంచి మార్గంలో నడిపేందుకు సమతా ఫౌండేషన్ ద్వారా చట్టాలపై చైతన్యం కల్పిస్తూ, అవగాహన పెంచుతున్నట్లు తెలిపారు.. ఈ కార్యక్రమాలకు తమరు సహాయ సహకారాలు అందించాలని కోరారు.. విద్య ద్వారానే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయి కనుక లైబ్రరీలు ఏర్పాటు చేసి యువతను చదువు వైపు మళ్లించాలని కోరారు. వృత్తి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించి ఉద్యోగ ఉపాధి కల్పించాలని తెలిపారు. రామగుండం మేడిపల్లి ఓసిపి 4 కింద సర్వం కోల్పోయిన దళితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ వారి తాత కాక వెంకట స్వామి తనకు చెప్పిన మాటలు గుర్తు చేసుకున్నారు. ఎవరైనా ఏదైనా సమస్య మన వద్దకు తీసుకొని వస్తే తప్పకుండా పరిష్కరించాలని తెలిపే వారని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నానని త్వరలోనే మీ సమస్యలకు పరిష్కారం చూపెడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ ఎన్టిపిసి పట్టణ కమిటీ అధ్యక్షులు ముడిమడుగుల సురేష్, ప్రధాన కార్యదర్శి చీమల ఆనంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ చందనగిరి శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాలుగో డివిజన్ అధ్యక్షులు భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భార్యపైనే హత్యాయత్నంకు ప్రయత్నించిన భర్త అరెస్ట్.



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని :** గోదావరిఖని పట్టణానికి చెందిన రామలక్ష్మి అనే గృహిణి తన భర్త అయిన గట్టయ్య వేరే వారితో అక్రమ సంబంధాలు పెట్టుకొని తనను శారీరకంగా మానసికంగా వేధించడం తో అతడి యొక్క తప్పును ఎత్తి చూపినందుకు కోపోద్రిక్తుడైన గట్టయ్య తన పురుష ఆదిపత్యంతో రామలక్ష్మీపై దాడి చేసి గొంతు బట్టి నలిమి గోడకేసి కొట్టి చంపే ప్రయత్నం చేసినాడు. ఇట్టి సంఘటనలో లక్ష్మి తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలో పడిపోవడంతో ఆసుపత్రికి చేర్చడం జరిగింది. గట్టయ్య రామగుండం కమిషనర్ లో హెూంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతను తన భార్య ఉండగా కూడా వేరే మహిళలతో సంబంధాలను కొనసాగిస్తూ, డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు పెడుతూ ఇంట్లో సాధారణమైన ఖర్చులకు కూడా డబ్బులు ఇవ్వకుండా భార్యను వేధిస్తున్నాడని, పలుమార్లు పెద్ద మనుషుల మధ్య పంచాయతీలు జరిగిన ఇతని వైఖరి మారలేదు, దీంతో రామలక్ష్మి పై హత్య ప్రయత్నం చేసినాడు ఇట్టి సంఘటనపై రామలక్ష్మి సోదరుడు ఇచ్చిన దరఖాస్తు మేరకు ఆవుల గట్టయ్య పైన హత్యాయత్నం కేసు గోదావరిఖని వన్ టౌన్ నందు నమోదు చేసి, అతన్ని అరెస్టు చేయడం జరిగినది.

# సిబ్బంది సమస్యల పరిష్కారంకే "పోలీస్ దర్బార్"




**అగ్నిధారన్యూస్ రామగుండం కమిషనరేట్ గోదావరిఖని :** శనివారం రోజున రామగుండం కమిషనరేట్ స్పెషల్ పార్టీ, క్యూ ఆర్ టి సిబ్బంది, అధికారులకు రామగుండం కమిషనర్ ఆఫ్ పోలిస్ఎం. శ్రీనివాస్,ఆదేశాల మేరకు కమీషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో "దర్బార్" కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమం కు సీపీ హాజరై స్పెషల్ పార్టీ, యుఆర్ టి తో మాట్లాడి సమస్యలను, వినతిలను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అడిగిన వినతిలను, సమస్యలను వెంటనె పరిష్కరించే విధముగా చూస్తాం అన్నారు. ఏలాంటి సమస్య ఉన్న దర్బార్ లో చెప్పడం ఇబ్బందిగా ఉంటే ఆఫీస్ కి వచ్చి నేరుగా కలిసి చెప్పవచ్చు తెలిపారు.ఈ సందర్భంగాసీపీమాట్లాడుతూ....స్పెషల్ పార్టీ, క్యూ ఆర్ టి పోలీస్ విధి నిర్వహణలో భాగంగా ఎన్నో పని ఒత్తిళ్లను ఎదుర్కోనాల్సి వుంటుంది క్రమ శిక్షణ, ప్రణాళికబద్దంగా విధులు నిర్వహించడంతో ద్వారా ఈ ఒత్తిళ్లను అధిగమించవచ్చని కాని వ్యక్తిగత కారణాలతో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లు చాలా ప్రమాదకరమని కొన్ని సందర్బాల్లో ఈ ఒత్తిళ్ల కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోనాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో ఒత్తిళ్లు తట్టుకోలేక క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబ రోడ్డున పడుతుందని ముఖ్యంగా క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకునే ముందు మీ కుటుంబ గురించి ఆలోచించాలని సూచించారు. సిబ్బంది క్రమశిక్షణతో డ్యూటీ లను నిర్వర్తించాలని రామగుండం కమిషనరేట్ కి, తెలంగాణ పోలిస్ మంచిపేరు తీసుకురావాలన్నారు. బయట డ్యూటీస్ కి వెళ్ళినప్పుడు ఇబ్బందుల ఉంటె సంబందిత అదికారులకుతెలియచేయాలన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో, మంచిప్రవర్తన తో విదులు నిర్వర్తించినప్పుడు అదికారులు తమ వెంట ఉంటామన్నారు. సిబ్బందికి చేయవలసిన విధులు, చేయకూడని పనుల గురించి పలు సూచనలు, ఆదేశాలు చేయడం జరిగింది. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటు పడి, విధులలో నిర్లక్ష్యం వహించినట్లైతే, పోలీస్ శాఖ ప్రతిష్ట కి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన శాఖపరమైనచర్యతీసుకొవడంజరుగుతుందన్నారు .

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ. రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ లు దామోదర్, శ్రీనివాస్, ఆర్ ఎస్ఐ లు, సిబ్బంది పాల్గోన్నారు.

# ఫీజుల పేరిట విద్యార్థులను వేధిస్తే చూస్తూ ఊరుకోం.

**చదువుకునే రోజులు కాదు ఇవి, చదువుకొనే రోజులు ..**

**రేణుకుంట్ల ప్రీతం**




**అగ్నిదారన్యూస్ 8 ఇంక్లైన్ కాలనీ :** పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల పేరిట విద్యార్థులను వేధిస్తే చూస్తూ ఊరుకోమని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో చదువుకునే రోజులు పోయి చదువుకొనే రోజులు వచ్చాయని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యా వ్యాపారం చేస్తున్నాయే తప్ప, విద్యాభివృద్ధికితోడ్పాటునందిస్తలేవనిఅన్నారు. ఫీజులు త్వరగా చెల్లించాలని, చెల్లించని విద్యార్థులను తోటి స్నేహితుల ముందే నిలబెట్టి అవమానపరిచే విధంగా, మనస్థాపానికి గురయ్యే విధంగా వ్యవహరిస్తున్నారని. ఫీజులు త్వరగా చెల్లించకపోతే పరీక్షలు నిర్వహించమని,హాల్ టికెట్స్ఇవ్వమనివిద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తూ, విద్యను దూరం చేసే విధంగా చేస్తున్నారని ఆయన వాపోయారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీని, అవేమి పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగావ్యవహరిస్తున్నారని ఆయనఅన్నారు.విద్యార్థులను ఫీజుల పేరిట వేధిస్తే చూస్తూ ఊరుకోమని, విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో కలిసి పాఠశాలల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# బిజెపి అభ్యర్థులను గెలిపించండి



**అగ్నిధార న్యూస్ సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మున్సిపాలిటీ భారతీయ జనతా పార్టీ పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా పెద్దపల్లి జిల్లా బిజెపి అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి ఆదేశాల మేరకు సుల్తానాబాద్ మున్సిపాలిటి బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటర్లను కలిసి నిరంతరం ప్రజల తరుపున నిలబడే కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఎమ్మెల్సీ బిజెపి అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి కు టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించవలసిందిగా కోరారు. అలాగే ఎమ్మెల్సీ ఓటు వేసే విధానాన్ని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు, బిజెపి జిల్లా నాయకులు చిట్టవేని సదయ్య, కందునూరి కుమార్, మెండ శంకరయ్య, శేకర్ మాస్టర్, ఎగోలపు మల్లికార్జున్, పోచంపల్లి ఈశ్వర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ప్రశాంతత

**ఆకట్టుకున్న అన్యువల్ స్పోర్ట్స్ మీట్**



**అగ్నిధార న్యూస్ సుల్తానాబాద్ :** క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుం దని ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ అన్నారు .స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో శని వారం అన్యువల్ స్పోర్ట్స్ మీట్ ను ప్రార ంభించారు. విద్యార్థులకుకబడ్డీ, కోకో, వాలీబాల్, రన్నింగ్ మొదలైన క్రీడలను నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్క విద్యార్థి క్రీడల పై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని గ్రామీణ క్రీడాకారులు సైతం జాతీయస్థాయి లో రాణిస్తున్నారని పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యలు, వ్యాయామ ఉపాధ్యాయులు,తల్లిదండ్రులువిద్యార్థులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



### చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి):** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామనికి చెందిన ప్రవీణ్ కరెంట్ షాక్ తో మరణించడం జరిగింది. ఈ విషయం స్థానిక బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాజీ తెలంగాణ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 3,000 మూడువేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో, గ్రామ సభ్యులు తాజా మాజీ వార్డు సభ్యులు అనిత ఎల్లయ్య, చౌటి విజయకుమార్, బండగల్ల చందు, చౌటి రవి , కుమార్, పెంటయ్య, శివగళ్ల రవి సతీష్ మహేష్ నరేష్ రమేష్, మల్లేష్ పండే ,శ్రీశైలం, రాజు, గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలికుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటాం



### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామం శరణయ్య శివాజీల తల్లి జంగమ్మ బాయి అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మృతురాలి నివాసానికి చేరుకొని మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో, ఎమ్మెల్యే సోదరుడు వెంకట రెడ్డి, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నూతన సబ్ స్టేషన్ కోసం స్థలం పరిశీలన



### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామ పంచాయతీ శివారులో నూతన సబ్ స్టేషన్ (33/12 కె వి స్థలం కోసం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ,ఎమ్మార్వో నాగార్జున , ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్ ,మాజీ ఎంపీపీ రఘురాములు, మైనార్టీ మండల అధ్యక్షులు ఆరిఫ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డేవిడ్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజేందర్ నాయక్, జూలపల్లి శ్రీనివాస్, లింగం కుమార్, నాని, తదితరులు పాల్గొన్నారు.

# భీమలింగేశ్వర స్వామి కళ్యాణానికి ఆహ్వాన పత్రిక అందజేత



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** హైదారాబాద్ లోని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ,ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు. అనంతరం కల్వకుర్తి శివాలయం శివపార్వతుల కల్యాణం కోసం 1,16,000/- (ఒక లక్ష పదహారు వేల రూపాయలు) విరాళం అందచేసిన ఉప్పల వెంకటేష్, ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్ సైన్యం బిఆర్ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోని గణేష్ ఆలయ కమిటీ సభ్యులు యం.రాజు, మాసుల రాజు, రమేష్ యాదవ్,దేవయ్య, చింతమోనీ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రవీణ్ కుమార్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటాం

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన చెవిటి ప్రవీణ్ కుమార్ వయస్సు 24 సంవత్సరాలు కేబుల్ టీవీ ఆపరేటర్ గా పని చేస్తూ కేశంపేట్ మండల్ లో పాటిగడ్డ వద్ద విద్యుత్ ఘాతానికి గురై గత ఆరు రోజుల నుండి హైదరాబాద్ ఉస్మానియా హాస్పిటల్ లో చికిత్స పొందుతూ నిన్న రాత్రి మూడు గంటలకు మరణించడం జరిగింది ఇట్టి విషయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోకూరి ప్రభాకర్ రెడ్డి 3000 రూపాయలు పడకల్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ శ్రీశైలం యాదవ్ 3000 రూపాయలు బాధిత కుటుంబానికి అందించడం జరిగింది మొత్తం 6000 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో,పడగల్ గ్రామ తాజా మాజీ ఎంపీటీసీ జోగు రమేష్, శ్రీశైలం, చెవిటి మహేష్, బురిగల్లా నరసింహ, జోగు రామచంద్రయ్య, ఎండి బషీర్ తుళ్ల తిరుపతి గౌడ్, బర్ల చెన్నయ్య, డిజె శివ, సాకలి గణేష్, బండగల రమేష్ ,చెవిటి లక్ష్మయ్య, బండగాల్ల పుల్లయ్య, తదితరులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు ప్రవీణ్ కుమార్ కు ఆత్మ శాంతి చేకూరాలని నాయకులు కోరుకున్నారు

# ఐక్యత ఫౌండషన్ సహకారంతో ఉద్యోగాలకు ఎంపికైన మహిళలు

### ఐక్యత ఫౌండేషన్ చైర్మన్

### టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం చుక్కాపూర్, ఎడవెల్లి గ్రామాలకు చెందిన మహిళలు తుక్కుగూడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఐక్యత ఫౌండేషన్ చైర్మెన్ టాస్క్ సి ఓ ఓ సుకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆద్వర్యంలో ఇంటర్వ్యూకి హాజరు కావడం జరిగింది,ఈ ఇంటర్వ్యూస్ ద్వారా రిక్రూట్మెంట్ ప్రక్రియలో మొత్తంగా 23మంది మహిళలు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని,వీరు రెండు రోజుల్లో ఉద్యోగంలో చేరి విధులకు హాజరవుతారని ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా,ఉద్యోగాలకు ఎంపికైన మహిళలు మాట్లాడు తూ,నియోజకవర్గంలోని మహిళలకు మంచి ఉద్యోగావకాశాలు కల్పిస్తూ,వారి కుటుంబాలకు భరోసానిస్తున్న.టాస్క్- సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోచుక్కపూర్ గ్రామం ప్రజాప్రతి నిధులు,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు,ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్యాడు పెన్నులు అందజేసిన మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి స్వేరో సర్కిల్ లో మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య తేదీ: 23/02/2025 నాడు గురుకులాల ఐదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ఉన్నాయని తెలుసుకొని స్వేరో సర్కిల్ లో 67 మంది విద్యార్థులకు ఫ్యాడ్లు, పెన్నులు,పెన్సిల్స్,అందించి విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ చెప్పి, విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి స్థాయిలో ఉండాలని చెప్పారు అలాగే గత ఆరు సంవత్సరాల నుంచి స్వేరో సర్కిల్ ను నడిపిస్తున్న, పెరుమండ్ల సురేష్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో, స్వేరో సర్కిల్ కమాండర్ పెరుమండ్ల సురేష్, మాజీ 1 వ వార్డ్ నెంబర్ శ్రీను, ఇంద్రయ్య, యాదయ్య గారు లింగం పాల్గొన్నారు.

# మలబార్ గోల్డ్ సహాయాన్ని విద్యార్థులు మరచిపోవద్దు

### పొల్యూషన్ బోర్డ్ సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మలబార్ గోల్డ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 173 మంది విద్యార్థులకు 13 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు స్టేట్ మెంబర్ బాలాజీ సింగ్ కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మలబార్ గోల్డ్ ట్రస్ట్ కొండాపూర్ బ్రాంచ్ హెడ్ బిలాన్ , అజీత్ హాజరైనారు .

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న గర్ల్స్ స్టూడెంట్స్ కు గత 4 ఏండ్లగా 36 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించడంతో పాటుగా ఈ సంవత్సరంలో మలబారు గోల్డ్ ట్రస్ట్ ఆద్వర్యంలో 173 మంది విద్యార్థులకు 13 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేయడాన్ని బాలాజీ సింగ్ ,ఆనంద్ కుమార్ అభినందనలు వ్యక్తం చేశారు. విద్యార్థులు గురువులు చెప్పింది శ్రద్ధగా విని కష్టపడి చక్కగా చదవి వందశాతం పాస్ కావాలని వారు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామి రెడ్డి సార్ ఆద్వర్యంలో సీనియర్ లెక్చరర్ సదానందం గౌడు మరియు అధ్యాపకులు టీం వర్కుతో విధులు నిర్వహిస్తు విద్యార్థులకు స్టడీఅవర్, చక్కటి యూనిఫామ్, ఐడికార్డు అంది ంచి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అభినంది ంచారు. విద్యార్థుల దేశభక్తి, జానప దుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆలరిం చాయి. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో, ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, గోపాల్ రావు , శేఖర్ , సుధాకర్ కల్వకుర్తి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణు అధ్యాపకులు సదానందం గౌడ్, రమకాంత్ , పరశురాం, మల్లేష్ బాల్ రాజ్ , భీమేశ్ , శ్రీనివాస్,జుబేర్ మహబూబ్ అలీ, బిల్కీస్ ఫాతిమా, మల్లికార్జున్, లక్ష్మీ కాంత్ సాగర్ , లక్ష్మయ్య , నర్సింహులు, హైమద్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.




# ప్లాస్టిక్ విక్రయాలు నిలిపివేయాలి

### మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్



**అగ్ని ధార న్యూస్ సుల్తానాబాద్ :** వాతావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టిక్ కవర్లు ప్లేట్లు గ్లాసులు ఇతరత్రా విక్రయాలను నిలిపి వేయాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ప్లేట్ల తయారీ, దుకాణ యజమానులకు మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ..సమాజంలో నిత్యం ప్లాస్టిక్ వాడకం అధికమవుతుందని తద్వారా వాతావరణం పూర్తిగా కాలుష్యం అవుతుందని ఎక్కడ చూసినా కవర్లు కుప్పలు కుప్పలుగా కనబడుతున్నాయని నిత్యం ప్రతి వ్యాపారి వేలాది కవర్లను వినియోగదారులకు వివిధ సామాగ్రి తో అందిస్తున్నారని తద్వారా కవర్ల వాడకం అధికమవుతుందని, అలాగే రోడ్లు డ్రైనేజీలు ఖాళీ స్థలాలలో విపరీతంగా గుట్టలుగా ప్లాస్టిక్ నిల్వలు పేరు కు పోతున్నాయని వీటిని పశువులు సైతం మేయడంతో జీర్ణం కాకపోవడంతో అవి అనేక సందర్భాలలో మృత్యువాత పడుతున్నాయని వివరించారు. హెూటల్ యజమానులు సైతం పేపర్ గ్లాసుల పేరుతో అందిస్తున్న టీ కాఫీ లాంటివి ఆ గ్లాసులో తాగడంతో అది రోగాలకు దారి తీసే అవకాశాలు ఉన్నాయని హెూటల్ వ్యాపారులు పేపర్ గ్లాసులు నిలిపివేయాలని సూచించారు. వివిధ వివాహది శుభకార్యాలలో పేపర్ ప్లేట్లు గ్లాసులు వేల సంఖ్యలో వినియోగించడంతో అవి మానవాళి మనుగడకు ముప్పుగా మారుతున్నాయి అన్నారు. ఒక్క కవరు భూమిలో కలిసిపోయేందుకు అనేక సంవత్సరాలు పడుతున్నాయని తద్వారా భూమి సైతం తన సౌరవత్వాన్ని కోల్పోతుందని 15 రోజులలో వీటిని నిలిపివేయాలని తక్షణమే పేపర్ బ్యాగులు, జనపనారా సంచులు విక్రయాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు అధిక్రమిస్తే తరచు దాడులు నిర్వహిస్తామని అధిక మొత్తంలో జరిమానాలు విధించడంతోపాటు దుకాణ లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలోసానిటరీ ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్ విక్రయిదారులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబ ఇంటి నిర్మానికి సిమెంట్ ఐరన్ అందజేత

### చారి ట్రాబులు ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పూర్తి ఇండ్ల నిర్మాణం అసంపూర్తి ఇండ్ల నిర్మాణం లో భాగంగా నిరుపేద కుటుంబానికి చెందిన మీరిగిరి నారాయణ తండ్రి పేరు జంగయ్య ఇంటి పూర్తి నిర్మాణం కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ మాజీ చైర్మన్ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ జడ్పిటిసి వెంకటేష్ తన ట్రస్ట్ ద్వారా సిమెంట్ ,ఇప్పించడం జరిగింది. ఈసందర్భంగా నిరుపేద కుటుంబానికి చెందిన మీరిగిరి నారాయణ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, నాయకులు ఓరుగంటి వెంకట రెడ్డి , మాజీ మండల్ కో ఆప్షన్ నెంబర్ ఇమ్రాన్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ఎల మందరెడ్డి చిట్టిల యాదయ్య గ్రామ అధ్యక్షుడు యాదయ్య జంగయ్య విజయ్ ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# శివాలయం ప్రారంభోత్సవనికి నియోజక వర్గ ప్రజలకు ఆహ్వానం

### ఉప్పల చారి ట్రబుల్ ట్రస్టు ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తేది 26/02/2025, బుధవారం,మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తలకొండ పల్లి పరిధిలోని శ్రీ నరసింహ స్వామి గుట్ట పైన శివాలయం గుడి ప్రారంభోత్సవం జరుగుతుంది కాబట్టి, కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప్పల చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్, తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మండల మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com